# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 14-6-2024 15/-




# ఎన్ని'కల్లలు'?






# గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237

Email : geeturaiweekly@gmail.com

Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 24 హైదరాబాద్
శుక్రవారం 14 జూన్ 2024 రూ.15-00
7 జిల్ హిజ్జహ్ 1445 హిజ్రీ


**తొలిగీటు**

దైవ గ్రంథం గురించిన
ఎక్కువ జ్ఞానం కలిగినవాడు,
దైవగ్రంథాన్ని ఎక్కువగా
చదివేవాడు నమాజు
నాయకత్వానికి అర్హుడు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**





# ఊతకర్రల ప్రభుత్వాన్ని నడపగలరా?

12

## లోపల...


| | |
|---|---|
| ముస్లిం ఓట్లు ...... | 04 |
| ఎన్ని'కల్లలు'? ...... | 05 |
| క్రీడాధన శ్రేష్ఠుడు – 33 ...... | 08 |
| చరితార్థులు–2 : హాజీ సాహెబ్ తురంగ్ జైయ్ ...... | 11 |
| మహల్లాలో ప్రయత్నాలు ...... | 14 |
| సహనం ఒక అమూల్య సంపద ...... | 17 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) ...... | 18 |
| అడుగుజాడలు ...... | 19 |
| పవిత్ర మక్కా ప్రాశస్త్యం ...... | 20 |
| నాకు బాగా తెలిసిన మరో ఉమరీ ...... | 24 |
| సహనం సాహసానికి ప్రతిరూపం ...... | 25 |
| దైవ సామీప్యమే ఖుర్బానీ ...... | 26 |
| పవిత్రత గల పది రోజులు ...... | 29 |
| అల్లాహ్ అస్తిత్వాన్ని నిరూపించే ఖుర్ఆన్ బోధనలు ...... | 30 |
| మనోవాంఛల దాస్యం జీవితంపై వేసే దుష్ప్రభావం ...... | 33 |


### మోడీ నైతిక ఓటమి...




చార్ సౌ పార్ అంటు
కోశారు భలే కోతలు
వినీ వినీ విసిగి జనం
పెట్టారు బాగ వాతలు!
చావుదప్పి కన్నులొట్ట
పోయింది భాజపాకు
నైతికంగ మట్టి గరిచి
గద్దెనెక్కుతున్న ఫేకు!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

## ఆలోచన

# ముస్లిం ఓట్లు

ఎన్నికలు ముగిశాయి. ఎన్డీయే మెజారిటీ సాధించింది. కాని మెజారిటీ సాధించిన ఉత్సాహం, ఆనందం ఎన్డీయేకి సారథ్యం వహిస్తున్న బీజేపీలో లేదు. మరోవైపు ఇండియా కూటమికి మెజారిటీ రాలేదు. అయినా ఇండియా కూటమిలో విజయం సాధించిన ఉత్సాహం కనిపిస్తుంది. ఈ ఎన్నికల్లో ఈ విచిత్రమైన పరిస్థితి బహుశా రానున్న కాలాల్లో ఒక ఉదాహరణగా మిగిలిపోతుంది. నిజం చెప్పాలంటే ఈ ఎన్నికల్లో ప్రజలు ఎవరికీ గెలుపు ఇవ్వలేదు. మోడీని నైతికంగా ఓడించారు.

ఈ ఎన్నికల్లో గమనించవలసిన మరో వాస్తవమేమిటంటే, సగటు ఓటర్లు భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్న నిబద్ధత చూపించారు. ముఖ్యంగా భారత ముస్లిములు ప్రదర్శించిన ప్రజాస్వామిక పరిపక్వత గమనించదగింది.

ఉత్తరప్రదేశ్‌లో ఇండియా కూటమిలోని పార్టీలు ముస్లిము జనాభా అత్యధికంగా ఉన్న నియోజకవర్గాల్లో కూడా ముస్లిములకు టిక్కెట్లు ఇవ్వలేదు. అయినప్పటికీ ముస్లిములు రాజ్యాంగ పరిరక్షణ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పార్టీలకు ఓటేశారు.

భారతరాజకీయాల్లో ముస్లిముల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. భారత పార్లమెంటులో ముస్లిం జనాభా ప్రకారం కనీసం 75 మంది ఎంపీలు ఉండాలి. అలాంటి పరిస్థితి మనం పార్లమెంటులో ఎన్నడూ చూడలేదు. ఈసారి కూడా ముస్లిముల ప్రాతినిధ్యం పార్లమెంటులో తక్కువగానే ఉంటుంది. కాని గమనించవలసిన విషయమేమిటంటే, భారత రాజ్యాంగ పరిరక్షణ దృష్టిలో ఉంచుకున్న ముస్లిం ఓటర్లు ముస్లిం అభ్యర్థులు రంగంలో ఉన్న నియోజకవర్గాల్లో కూడా ముస్లిం అభ్యర్థిని ఓడించి, ఇండియా కూటమిని గెలిపించారు.

ముస్లిం ప్రాతినిధ్యం పెంచడం గురించి కాదు రాజ్యాంగ పరిరక్షణకు ముస్లిములు ఈ సారి అధిక ప్రాముఖ్యం ఇచ్చారు. ముస్లిం ఓటర్లు చూపించిన ప్రజాస్వామిక పరిపక్వత వల్లనే ఇండియా కూటమి ఇన్ని స్థానాలు సాధించిందన్నది ఎవ్వరూ కాదనలేని వాస్తవం. కాని దేశంలో ఉన్న మతతత్వ రాజకీయాల వల్ల ఏ పార్టీ కూడా ముస్లిముల పేరు ఎత్తడానికి కూడా ఇష్టపడలేని పరిస్థితి ఇప్పుడు నెలకొంది. ఈ పరిస్థితి దేశానికి మంచిదా?

గమనించవలసిన మరో వాస్తవమేమిటంటే, ఈ ఎన్నికల్లో ప్రధాని కేవలం ముస్లిములపై దాడి చేయడమే తన ప్రచారంలో చేసిన ఒకే ఒక్క పని. అయినా ముస్లిములు రెచ్చిపోలేదు. ఈ రెచ్చగొట్టే ప్రసంగాలను, వ్యాఖ్యలను పట్టించుకోలేదు. రాజ్యాంగ పరిరక్షణ ప్రధానంగా ఓటేశారు. ముస్లిములు ప్రదర్శించిన ఈ పరిపక్వతే నేడు రిజర్వేషన్లు పొందుతున్న అనేక సముదాయాల రిజర్వేషన్లను కూడా కాపాడిందనుకోవచ్చు.

పౌరసత్వ సవరణ చట్టం, కర్నాటకలో హిజాబ్ వివాదం, ఎన్నార్సీ దేశవ్యాప్తంగా జరుపుతారన్న ప్రకటనలు మోడీ కాలంలో జరిగిందంతా ముస్లిం వ్యతిరేక కార్యకలాపాలు తప్ప మరేమీ లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ముస్లిములు సహజంగానే ప్రజాస్వామికంగా పరిపక్వత ప్రదర్శించక తప్పదు. ఈ చైతన్యం రానున్న ఎన్నికల్లో మరింత పటిష్టమయ్యే సూచనలున్నాయి. ముస్లిములే కాదు ఇతర సముదాయాలు కూడా ఈ చైతన్యాన్ని అందిపుచ్చుకునే సూచనలున్నాయి.

గతంలో ముస్లిం ఓట్లను చీల్చడం ద్వారా గెలుపు సాధించిన వాళ్ళు ఇప్పుడు ఈ కొత్త పరిస్థితిని ఎదుర్కోక తప్పదు. ముస్లిం ఓట్ల వల్లనే ఇండియా కూటమి విజయాలు సాధించిందన్నది అందరికీ తెలిసినా ఏ పార్టీ కూడా ముస్లిముల పేరు చెప్పడానికి సిద్ధంగా లేదు. గత కొంతకాలంగా దేశంలో నెలకొన్న మతతత్వ వాతావరణం వల్ల హిందూ ఓట్లు కోల్పోతామన్న భయంలోనే పార్టీలున్నాయి. తమకు ఎవరు ధన్యవాదాలు చెప్పినా చెప్పకపోయినా ముస్లిములు తమ కర్తవ్యాన్ని నిర్వర్తించారు. రాజ్యాంగ పరిరక్షణ దిశగా ఓటు వేశారు. ఇది గమనించవలసిన వాస్తవం.

సచర్ కమిటీ నివేదిక తర్వాత భారతదేశంలో 14 శాతం ఉన్న ముస్లిం జనాభా ఎంత వెనుకబాటుకు గురయ్యిందో అందరికీ స్పష్టంగా తెలిసింది. దేశంలో ఒక పెద్ద జనాభా వెనుకబాటుకు గురై ఉంటే వారి ప్రగతి వికాసాల కోసం పాజిటివ్ చర్యలు చేపట్టడం దేశప్రగతి వికాసాలకు అవసరమన్నది ఎవ్వరు కాదనలేని వాస్తవం. కాని ముస్లిముల కోసం ఏదన్నా చేస్తామని చెప్పుకునే పరిస్థితి కూడా లేని వాతావరణం దేశంలో ఏర్పడితే అది దేశప్రగతి వికాసాలకు మంచిదా? ప్రజలంతా ఆలోచించవలసిన ప్రశ్న ఇది.

అబ్దుల్ వాహెద్




**సాధారణ ఎన్నికలు ముగిశాయి.** ఇవి 18వ లోక్‌సభ కోసం జరిగిన ఎన్నికలు. ఈ ఎన్నికల్లో చాలా మంది కలలు "కల్లలు" అయ్యాయి. ముఖ్యంగా రామమందిర నిర్మాణం తర్వాత 2024 ఎన్నికల్లో భారీ విజయం తథ్యం అని భావించిన వారి ఆశలు అడియాసలయ్యాయి. రామమందిరం కట్టాం కాబట్టి మాకు ఓటేయండని సూటిగానే మోడీ, యోగీ తదితర నేతలు అడిగినా ప్రజలు ఓటేయలేదు. అయోధ్య ఉన్న ఫైజాబాదులో కూడా బీజేపీ ఓడిపోయింది. రాముడి పేరుతో రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టి రాజకీయ పరిపక్వతను ప్రదర్శించారు. ఈ ఎన్నికల్లో గమనించవలసిన మరో ముఖ్యమైన విషయం హిందూ హృదయ సామ్రాట్‌గా, తన్ను తాను బయోలాజికల్ కాదంటూ అవతార పురుషుడిగా చెప్పుకున్న మోడీకి వారణాసిలో కేవలం లక్షన్నర ఓట్ల ఆధిక్యం లభించింది. రాహుల్ గాంధీ మూడు లక్షల తొంభై వేల మెజారిటీ సాధిస్తే, అమేథీలో స్మృతి ఈరానిపై పోటీ చేసిన కిశోరిలాల్ శర్మ, బీజేపీ నేతలు గాంధీ కుటుంబానికి సెక్రటరీ అని కించపరిచిన కిశోరీలాల్ శర్మ లక్షా అరవై ఏడు వేల ఓట్ల మెజారిటీ సాధించాడు.

ఈ ఎన్నికల్లో అత్యధికంగా ఓట్లు సాధించింది ఒక ముస్లిం అభ్యర్థి. ఆయన పేరు రకీబుల్ హసన్. ఆయన పోటీ చేసింది అస్సాంలోని ధుబ్రీ నియోజకవర్గంలో. ఆయన పదిలక్షల పన్నెండు వేల ఓట్లు సాధించాడు. కేరళలో బీజేపీ పాదం మోపే అవకాశం కూడా ఈ ఎన్నికల్లో లభించింది. కేరళలో ఆరెస్సెస్ నెట్‌వర్క్ చొచ్చుకుపోతుందనడానికి ఇదొక సంకేతం. తమిళ నాడులోను బీజేపీకి 11 శాతం ఓట్లు లభించాయి. దక్షిణాదిలో బీజేపీ విస్తరించడం చాపక్రింద నీరులా కొనసాగుతూనే ఉంది. ఉత్తరాదిలో బీజేపీ ఓట్ల శాతం బాగా తగ్గింది. నిజానికి ఉత్తరప్రదేశ్, బీహారు రెండు రాష్ట్రాల్లోను బీజేపీ ఓట్లు 8 శాతం తగ్గాయి. కాని ఉత్తరప్రదేశ్‌లో 80 స్థానాల్లో బీజేపీ 33 సీట్లు పొందితే, బీహారులో 40 స్థానాల్లో బీజేపీ 29 సాధించింది. ఈ ఎన్నికల్లో సూరత్‌లో బీజేపీ పోలింగ్ కన్నా ముందే గెలిచింది. అభ్యర్థులందరు పోటీ నుంచి తప్పుకున్న సంఘటన రాజకీయ కుట్రగా ఆరోపణలు మొదలయ్యాయి. పోటీ లేదు కాబట్టి బీజేపీ అభ్యర్థి గెలిచినట్లు ఎన్నికల కమీషన్ ప్రకటించింది. ఇదే పరిస్థితి ఇండోర్‌లోను జరిగేదే, పోటీ చేస్తున్న వారిని భయప్రలోభాలతో

తప్పుకునేలా చేశారనే ఆరోపణలు వచ్చాయి. కాని అక్కడ సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా నాయకుడు తలవంచక నిలబడ్డాడు. ఆయనకు వచ్చిన ఓట్లు తక్కువ. కాని నోటాకు రెండు లక్షల పైచిలుకు ఓట్లు పడ్డాయి. కాని సూరత్ లో పోటీ లేకుండా బీజేపీ అభ్యర్థి గెలుపొందాడని ప్రకటించడం వల్ల ప్రజలకు నోటాకు ఓటేసే అవకాశం లేకుండా చేశారు.

370 అధికరణను రద్దు చేసి కశ్మీరుకు చాలా మేలు చేసినట్లు చెప్పుకునే బీజేపీ కనీసం అక్కడ పోటీ కూడా చేయలేదు. కాంగ్రెసు గెలిస్తే హిందూ మహిళల మంగళసూత్రాలు కూడా లాక్కుని ముస్లిములకు పంచేస్తుందని మోడీ చెప్పిన బాన్స్ వాడలో, హిందువులకు రెండు గేదెలుంటే ఒక గేదెను లాక్కుని కాంగ్రెసు ముస్లిములకు ఇచ్చేస్తుందని చెప్పిన బనస్ కాంతలో బీజేపీ ఓడిపోయింది. ఏది ఏమైనా మోడీకి గ్యారంటీ అని మోదీ పేరుతో ప్రచారం జరిగిన ఈ ఎన్నికల్లో ఎవరు గెలిచా రన్నది కాదు ముఖ్యం... మోడీ నైతికంగా ఓడిపోయారన్నదే ముఖ్యం.

ఎందుకంటే బీజేపీ ఈ ఎన్నికల్లో కేవలం మోడీ పేరుపైనే పోటీ చేసింది. పార్టీ మేనిఫెస్టో కూడా మోడీకి గ్యారంటీగా ముందుకు తెచ్చారు. 48 పేజీల మేనిఫెస్టోలో మోడీ పేరు 67 సార్లు చెప్పారు. అయినా బీజేపీ 2019 కన్నా తక్కువ స్థానాలు మాత్రమే గెలిచింది. అంతేకాదు మోడీ మంత్రివర్గంలోని అనేక మంది మంత్రులు ఓడిపోయారు. స్మృతి ఈరానీ, అజయ్ మిశ్రా తేనీ, అర్జున్ ముండా, కైలాస్ చౌదరీ, సంజీవ్ బల్యాన్, మహేంద్ర నాథ్ పాండే, కౌశల్ కిశోర్, రాజీవ్ చంద్రశేఖర్, సాధ్వి నిరంజన్ జ్యోతి, భానుప్రతాప్ సింగ్ వర్మ, కపిల్ మోరేశ్వర్ పాటిల్, ఆర్కే సింగ్, వి. మురళీధరన్, ఎల్. మురుగన్, రావు సాహెబ్ దాదారావు దాన్వే తదితరులు ఓడిపోయారు.

అమేథిలో రాహుల్ గాంధీ పోటీ చేయడం లేదని తెలిసినప్పుడు మోడీ "భయపడకు" అంటూ హేళన చేశారు. కిశోరీలాల్‌ను అమేథీ నుంచి కాంగ్రెస్ నిలబెట్టినప్పుడు కిశోరిలాల్‌ను అపహ సించారు. కాని చివరకు కిశోరిలాల్ స్మృతి ఈరానీని లక్షా అరవై వేల ఓట్లతో ఓడించాడు. అయోధ్యలో బీజేపీ ఓడి పోయింది. అలహాబాదులో కాంగ్రెసు నలభై సంవత్సరాల తర్వాత గెలిచింది. బీజేపీ ఓడిపోయింది. మణిపూర్ ప్రజలు బీజేపీకి బుద్ధి చెప్పారు. అక్కడ కాంగ్రెసు గెలిచింది. అన్నింటికి మించి అపజయం లేని నాయకుడిగా, దివ్యశక్తులున్న, బయో లాజికల్ కాని, అవతారపురుషుడిగా తన్ను తాను చెప్పుకున్న మోడీకి ఈ ఎన్నికల్లో ఆయనేమిటో ప్రజలు తెలిసేలా చేశారు. సంకీర్ణ ప్రభుత్వాలను బలహీనప్రభుత్వాలుగా హేళన చేసిన మోడీ, బలమైన నాయకుడిగా చెప్పుకునే మోడీ ఇప్పుడు ఊతకర్రల సహాయంతో నడిచే సంకీర్ణ ప్రభుత్వానికి సిద్ధపడేలా చేసారు ప్రజలు. నైతికంగా ఆయన ఓడిపోయాడని చెప్పడానికి ఈ కారణాలు చాలవా?

ఈ ఎన్నికల్లో ఎలక్షన్ కమీషన్ వైఫల్యాల చిట్టా చాలా పెద్దది. ఈసారి బీజేపీ ప్రచారాన్ని గమనిస్తే, దేశంలో ముస్లిముల గురించి ఒక రిఫరెండం నిర్వహించారా అనిపిస్తుంది. బీజేపీ ప్రభుత్వం చేసిన మంచి పనుల గురించి చెప్పుకోడానికి ఏదీ లేదు. ఏప్రిల్ 21 తర్వాతి నుంచి మోడీ ప్రతి సభలోను ప్రతిరోజు ముస్లిములకు వ్యతిరేకంగా విద్వేష ప్రసంగాలు చేశారు. ముస్లిములను చొరబాటుదారులన్నారు. అధిక సంతానం కలిగి ఉండేవారంటూ భారత జనాభాకు ముస్లిములే కారణమన్నట్లు మాట్లాడారు. జిహాదీలన్నారు. ఇలాంటి చాలా మాటలే వాడారు. ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెసు వారి ముందు ముజ్రా చేస్తుందంటూ అతినీచంగా మాట్లాడడానికి కూడా వెనుదీయ లేదు. కాంగ్రెసు ప్రజల ఆస్తులను లాక్కుని ముస్లిములకు పంచేస్తుందన్నారు. దళిత బీసీ రిజర్వేషన్లకు కోత పెట్టి ముస్లిము లకు రిజర్వేషన్లు ఇస్తుందన్నారు. చివరకు క్రికెటు టీములో కూడా కాంగ్రెసు గెలిస్తే ముస్లిములకే అవకాశాలు లభిస్తా యన్నారు. బుల్డోజర్లతో ఇళ్ళు కూల్చడాన్ని మెచ్చుకున్నారు. ఇలా కూల్చిన ఇళ్ళు దాదాపు అన్నీ ముస్లిములవే. అమిత్ షా తన ప్రచారంలో ముస్లిములు లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్, ఫారెస్టు జిహాద్ చేస్తుంటారని చెప్పారు. ముల్లాలకు, మదరసా మాఫియాలకు, చొరబాటుదారులకు అంటూ ముస్లిములను నిందిస్తూ ప్రసంగించాడు. యోగీ ఆదిత్యనాథ్, హేమంత బిశ్వ శర్మలు కూడా ఇలాంటి ప్రసంగాలే చేశారు. బీజేపీ అధికారిక సోషల్ మీడియా ప్రచారం కూడా ఇలాగే కొనసాగింది. మోడీ, బీజేపీలు ఈ సారి ఎన్నికల ప్రచారం మొత్తం ముస్లిం వ్యతిరేక విద్వేష ప్రచారమే చేశారు. బీజేపీ అంటే ముస్లిం వ్యతిరేక పార్టీ అని ఓటర్లకు గట్టిగా చెప్పే ప్రయత్నం చేశారు. మరోవిధంగా చెప్పాలంటే ముస్లిం విద్వేషాన్ని సర్వసామాన్యం చేయడానికి ప్రయత్నించారు. దేశంలోని కోట్లాది ముస్లిములను విలన్లుగా చిత్రీకరిస్తే చాలు ఓట్ల వాన కురుస్తుందనుకున్నారు.

ఎన్నికలకు ముందు నుంచే ముస్లిముల పేరు వార్తల్లో చాలా

వచ్చింది. ముస్లిం ఓటర్ల పేర్లు ఓటర్ల జాబితాలో కనబడడం లేదన్న ఫిర్యాదులు చాలా వచ్చాయి. ముస్లిములు ఓటు వేయ కుండా అడ్డుకున్న వార్తలు కూడా వచ్చాయి. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నప్పటికీ, ఈ ప్రచారం ఎలాంటి వాతావరణాన్ని సృష్టించిందన్నది ముఖ్యం. గత దశాబ్దకాలంగా ముస్లిం విద్వేషం చాలా పెరిగిందని, ఇస్లామోఫోబియా చాలా ఎక్కువయ్యిందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అందువల్లనే ఈ ఎన్నికల్లో ముస్లిం విద్వేష ప్రచారమే ప్రధానంగా బీజేపీ ప్రచారం నిర్వహించింది. ఎన్నికల కమీషన్ పల్లెత్తు మాట అనలేదు.

ఈ ప్రచారంలో బీజేపీ ఎత్తుగడ పరిశీలించదగ్గది. కాంగ్రెసు ఇతర ప్రతిపక్షాలపై బీజేపీ చేసిన ప్రధానమైన దాడి, ఈ ప్రతి పక్షాలు ముస్లిముల పట్ల పక్షపాతంగా వ్యవహరిస్తాయని, ముస్లి ములకు మాత్రమే ప్రయోజనాలు చేకూరుస్తాయని, ముస్లిముల కోసమే పనిచేస్తాయని చెప్పే ప్రయత్నం. దీనికి కాంగ్రెసు కాని ప్రతిపక్షాలు కాని ఇచ్చిన సమాధానం – ముస్లిములు మేమేమీ ఇవ్వలేదని, ప్రయోజనాలు కల్పించలేదని, బీజేపీ చెప్పేది అబద్ధ మని ప్రజలకు చెప్పుకోవడం.

బీజేపీ ఆరోపణ, ప్రతిపక్షాల సమాధానాలు గమనిస్తే మనకు అర్థమయ్యేది ఏమంటే, ముస్లిములకు ఏదీ ఇవ్వరాదన్నది బీజేపీ పాలసీ, మేము ఏదీ ఇస్తామని చెప్పలేదని ప్రతిపక్షాల జవాబు. దేశంలో ముస్లిముల పరిస్థితి ఏమిటి? సగటు పౌరులుగా, సమానహక్కులున్న పౌరులుగా దేశప్రగతి వికాసాల్లో సమాన వాటా ముస్లిములకు లేదా? ముస్లిముల్లో వెనుకబాటు ఉంటే సంక్షేమ చర్యలు చేపట్టడం ప్రభుత్వ బాధ్యత కాదా?

సచర్ కమిటీ నివేదిక 2006లోనే ముస్లిముల పరిస్థితి దేశంలో ఎలా ఉందో తేల్చి చెప్పింది. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ముస్లిములకు అవకాశాలు శూన్యమయ్యాయి. ఉద్యోగాల్లోను రాజకీయాల్లోను వారి ప్రాతినిథ్యం రోజురోజుకు తగ్గిపోయింది. ముస్లిముల వెనుకబాటును తొలగించడానికి కంటితుడుపు చర్యలు ఏ ప్రభుత్వమైనా తీసుకుంటే వెంటనే బీజేపీ ముస్లిముల బుజ్జగింపు అని గగ్గోలు చేస్తుంది. ప్రతిపక్షాలు కూడా హిందూ ఓట్లు కోల్పోతామనే భయంతో వెంటనే సమర్థిం పులు, సమాధానాలు చెప్పుకుంటాయి. దేశంలో ముస్లిములు కూడా సమానహక్కులున్న పౌరులని ఈ పార్టీలు గుర్తిస్తు న్నాయా? ❑

# లోక్‌సభలో ముస్లిములు

**అజ్గర్ అలీ**



2024 ఎన్నికలు జరిగిన 543 స్థానాల్లో 78 మంది ముస్లిం అభ్యర్థులు బరిలో నిలిచారు. 24 మంది ముస్లిం అభ్యర్థులు లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందారు, వీరిలో మాజీ భారత క్రికెటర్ యూసుఫ్ పఠాన్ ఒకరు.

2019 ఎన్నికల్లో 115 మంది ముస్లిం అభ్యర్థులు పోటీ చేశారు.

ఎన్నికల్లో గెలిచిన ముస్లిం అభ్యర్థులలో కాంగ్రెస్ అభ్యర్థి ఇమ్రాన్ మసూద్ సహారన్‌పూర్ స్థానంలో 64,542 ఓట్ల భారీ తేడాతో గెలుపొందారు.

కైరానా నుంచి సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి 29 ఏళ్ల ఇక్రా చౌదరి 69,116 ఓట్లతో విజయం సాధించారు.

ఘాజీపూర్ స్థానంలో అఫ్జల్ అన్సారీ విజయం సాధించారు.

ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ విజయం సాధించి హైదరాబాద్ స్థానాన్ని నిలబెట్టుకున్నారు.

లడఖ్‌లో స్వతంత్ర అభ్యర్థి ముహమ్మద్ హనీఫా విజయం సాధించగా, మరో స్వతంత్ర అభ్యర్థి అబ్దుల్ రషీద్ షేక్ జమ్మూ కశ్మీర్‌లోని బారాముల్లా స్థానంలో విజయం సాధించారు.

ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌లో సమాజ్‌వాదీ పార్టీకి చెందిన మొహిబ్బుల్లా, సంభాల్‌లో జియా ఉర్ రెహ్మాన్ గెలుపొందారు.

జమ్మూ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్–రాజౌరీ సీటులో నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన మియాన్ అల్తాఫ్ అహ్మద్ గెలుపొందారు.

శ్రీనగర్‌లో ఎన్‌సీ అభ్యర్థిగా సయ్యద్ రూహుల్లా మెహదీ విజయం సాధించారు.

పశ్చిమ బెంగాల్‌లోని బహరంపూర్ స్థానంలో తొలిసారిగా పోటీ చేసిన యూసుఫ్ పఠాన్ విజయం సాధించారు. ❑

అధ్యాయం -12

33

# క్రీడా ధన శ్రేష్ఠుడు

ఎస్.ఎమ్. మలిక్

## 1. పఠనంలో వ్యత్యాసం, నేపథ్యం

కూఫా నగర సైనిక స్థావరంలో నలభై వేల సేన ఉండేది. అక్కడి గవర్నర్ వలీద్ బిన్ ఉఖ్బా. ఆజర్ బైజాన్‌ని కనిపెట్టు కుని ఉండే బాధ్యత కూడా ఆయనకే అప్పగించబడింది. మహనీయ ఉస్మాన్ కాలంలో ఇక్కడి జనులు తిరుగుబడి నట్లు అగుపిస్తే సిరియా నుంచి రెండు వేల మందిని పిలిపించుకోవడం జరిగింది. వలీద్ బిన్ అకబాను బర్తరఫ్ చేసి సయీద్ బిన్ ఆస్‌ని గవర్నర్‌గా నియమించడం జరిగింది.

## దేశ దేశాల్లో ఇస్లామ్ వ్యాప్తి

కొత్త గవర్నర్, హుజైఫాను సేనాపతి గానూ సిరియా సేనాని హబీబ్‌ని ఆయనకు సహాయకునిగాను నియమించి పంపారు. హుజైఫా వెళ్లి తిరుగుబాటు దారుల్ని బెదిరించగానే వారు తప్పు జరిగింది మన్నించవలసిందని, మున్ముందు శాంతంగా, నమ్మకంగా ఉంటామని జిజ్యా ఇచ్చి ఒప్పందం ద్వారా శపథం చేశారు.

అలాగే ఆర్మేనియాలోనూ తిరుగుబాటు సంభవిస్తే దాని అణచివేతకు ఖలీఫా ఉస్మాన్ (ర) మహనీయ హుజైఫాతోపాటు సల్మాన్ బిన్ రబీఅ బాహిలీని పంపారు. ఆయన అక్కడి తిరుగుబాటు దారుల్ని తిరిగి విధేయతా బంధనం లోకి తెచ్చారు. ఆ తరువాత మహనీయ ఉస్మాన్ నిర్దేశన మేరకు, మహనీయ హుజైఫా కాస్పియన్ సముద్ర తీరాల తిరుగుబాటు దారుల అణచివేతకు అక్కడి సేనా నాయకుడు అబ్దుర్రహ్మాన్ సహాయానికి వెళ్లి విజయవంతంగా తిరిగి కూఫా గవర్నర్ సయీద్ బిన్ ఆస్ వద్దకు వెళ్లారు.

అక్కడ మహనీయ హుజైఫా, సయీద్‌తో మాటల సందర్భంలో ఇరాక్, సిరియాలోని సైనికులు వేర్వేరు పఠనాలలో దివ్య కుర్ఆన్ చదువుతున్న విషయాన్ని చర్చించారు. బస్రా వాసులు, తాము మహనీయ ఇబ్ను మస్ఊద్ శిష్యులమని చెబుతున్నారు, దానికి భిన్నంగా హమస్, డెమాస్కస్ వాసులు తాము మహనీయ మిక్దాద్ ద్వారా కుర్ఆన్ పఠనం నేర్చుకున్నామని చెబుతారు. అదంతా విని కూఫా గవర్నర్ మహనీయ సయీద్, "అమీరుల్ మూ'మినీన్‌ని అభ్యర్థించి, ఈ వివిధ ఉచ్చారణల్ని కాదని ఒకే పఠనం ఒకే ఉచ్చారణను అధికారికంగా నియమించడం సముచితంగా ఉంటుందని సలహా ఇవ్వడం భావ్యం" అని చెప్పారు.

## నేపథ్యం

విదేశాల్లో ఇస్లామ్ వ్యాప్తి కారణంగానూ స్వయంగా అరేబియాలోని వివిధ ప్రాంతాల్లో మాటలాడే అరబీ యాస వేర్వేరుగా ఉండటం మూలంగానూ దివ్య కుర్ఆన్ పఠనంలో వ్యత్యాసం ఏర్పడింది. ఇంకా అరబ్బేతరులు ఇస్లామ్‌లో ప్రవేశించి వారు వివిధ ఉచ్చారణల్ని పలకలేక పోవడం చేత ఉచ్చారణా దోషాలు పొడసూపాయి. ఈ విభిన్న కారణాల వల్ల క్రమేణా దివ్య గ్రంథంలో ప్రక్షిప్తాలు పొడసూపే ప్రమాదముంది. పైగా ప్రవక్త మహనీయులు పరమపదించిన తరువాత ధర్మ భ్రష్టత ఓ తుఫానులా విజృంభించడం వల్ల దాన్ని అణచడానికి సహచర మాన్యులు ఎన్నో పోరాటాల్లో పాల్గొనవలసి వచ్చింది. ఆ పోరాటాల్లో సంపూర్ణ కుర్ఆన్ స్మర్తలయిన అనేక మంది సహచరులు అమరగతినొందారు.

## అసలు ప్రతి సేకరణ, ప్రచురణ

ఆ పైన మహనీయ ఉమర్(ర), తొలి ఖలీఫా మహనీయ అబూ బక్ర్ సిద్దీక్(ర)కు దివ్య కుర్ఆన్ మానవ స్మరణల నుంచి సమసిపోయే ముందే దాన్ని లిఖిత పూర్వకంగా భద్ర పరచాలని ఇచ్చిన సలహా మేరకు, ఆయన జైద్ బిన్ సాబిత్ నేతృత్వంలో ఓ కమిటీని నియమించి ఆ పని అప్పజెప్పారు. జైద్, ప్రవక్తశ్రీ(స) ఏర్పరచిన క్రమంలో దివ్య కుర్ఆన్‌ని ఒక్కొక్క పదం ఆ మూల ప్రతిలో లిఖించి ఏకత్రం చేశారు. ఇక ఎవరయినా సరే, ఆ మూలప్రతిని నకలు చేసి భద్రపరచుకోవచ్చు అని ప్రకటించారు. ఆ పైన ఆ మూల ప్రతిని మహనీయ హఫ్సా(ర) వద్ద భద్రపరిచారు.

అయితే పఠన దోషాలు అంతమయిపోవాలంటే ఆ సమయంలో ప్రాచుర్యంలో ఉన్న సమస్త పఠనాలను రద్దు పరచి అసలు ప్రతి ఆధారంగా నకళ్ళు తయారు చేసి అధికారికంగా ప్రాచుర్యంలోకి తేవడం అవసరం. ఆ విషయాన్నే మహనీయ హుజైఫా(ర) తన పర్యటన ముగించుకుని వచ్చిన పిదప మహనీయ ఉస్మాన్(ర)దృష్టికి తెచ్చారు. ఆయన తాను స్వయంగా ఆలోచించి, ఇతరుల తోనూ సంప్రతించి ఓ నిర్ణయానికి వచ్చారు.

తదనుగుణంగా మహనీయ హఫ్సా(ర) వద్ద ఉన్న మూల ప్రతిని తెప్పించారు. సంపూర్ణ కుర్ఆన్ స్మర్తలూ ప్రవక్త మహనీయుల 'వహీ'ని వ్రాసిన లేఖకులు అయిన మహనీయ జైద్ బిన్ సాబిత్ ఆధ్వర్యంలో ముగ్గురు వ్యక్తులతో ఓ కమిటీని నియమించారు. స్వయంగా ఆ ముగ్గురు కూడా దివ్య కుర్ఆన్‌ని కంఠస్థం చేసుకున్న స్మర్తలే. వారు, అబ్దుల్లా బిన్ జుబైర్, సయీద్ బిన్ అల్ ఆస్, అబ్దుర్రహ్మాన్ బిన్ హారిస్. ఈ నలుగురి మధ్య ఏదయినా పఠన భేదం ఏర్పడితే దాన్ని కురైషీల యాస, పఠనరీతిలో వ్రాయవలసిందని ఆదేశించారు మహనీయ ఉస్మాన్, ఎందుకంటే దివ్య కుర్ఆన్ ఆ యాసలోనే అవతరించింది.

ఈ నిర్దేశన ప్రకారం దివ్య కుర్ఆన్ నకళ్ళు తయారయిన తరువాత వాటిని అసలు ప్రతితో పోల్చడం జరిగింది. అసలు ప్రతిని మహనీయ హఫ్సా(ర)కు తిరిగి అప్పజెప్పి, తయారయిన నకళ్ళు ఇస్లామీయ రాజ్యాలకు పంపడం జరిగింది. కుర్ఆన్ ప్రతులతోపాటు మంచి స్మర్తలను కూడా పంపడం జరిగింది. కుర్ఆన్ పఠనంలో స్వస్థత, సమానతలను కాపాడటానికి జనులు తాము వ్రాసి పెట్టుకున్న ప్రతుల నన్నింటినీ రద్దు చేయాలని, కేవలం అధికారికంగా ప్రామాణికత గల ప్రతినే నకలు చేసుకుని వాటినే పఠించాలని ఆదేశించడం కూడా జరిగింది. ఈ కారణంగానే ఆయన్ని 'కుర్ఆన్ క్రోడీకరణ కర్త' గా గుర్తించారు.

## చెదురుమదురు సంఘటనలు

తొలి ఇద్దరు ఖలీఫాల కాలంలో ఈరాన్ సరిహద్దులు సువిస్తరమయ్యాయి. తూర్పున అఫ్ఘానిస్తాన్ మొదలుకొని అజర్ బైజాన్, ఉజ్బెకిస్తాన్, కుర్దిస్తాన్, వాయవ్యాన నల్ల సముద్రం తీరాల వరకు వ్యాపించాయి. ఫారూకీ (మహనీయ ఉమర్ ఫారూక్) కాలంలో ఈరాన్ చాలా మటుకు ఖిలాఫత్ అధీనంలోకి వచ్చేసింది. కాని ఆయన అమరగతి నొందిన తరువాత కొన్ని ప్రాంతాల్లో కొందరు అలజడి రేపారు. వారికి మహనీయ ఉస్మాన్(ర) సరయిన బుద్ధి చెప్పారు. కాని కొందరు తమ దుష్టతత్త్వం కారణంగానూ, రాజధాని దూరాన ఉండటం వల్లనూ ఇస్లామీయ సరిహద్దు ప్రాంతాల్లో దోపిడీ దుండగీడు సాగించేవారు. అక్కడికి ఇంకా ముస్లిములు చేరనేలేదు.

మహనీయ ఉస్మాన్ ఖిలాఫత్ మూడవ సంవత్సరం దూరపు సరిహద్దుల్లోని ప్రదేశాల్లో కొందరు దుండగుల అణచివేతకు బస్రా గవర్నర్ మహనీయ అబూ మూసా అష్అరీని అక్కడ సుస్థిర శాంతి స్థాపనకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అబూ మూసా(ర) వెంటనే సేనా నాయకుల (కమాండర్ల)ను

సమావేశ పరిచి జిహాద్, త్యాగాలను గురించి ప్రభావవంతంగా ప్రసంగించారు. తగిన విధంగా దాని వల్ల ప్రయోజనం కలిగింది. సేన బయలుదేరినప్పుడు అబూ మూసా ఎంతో సామగ్రి తన సౌలభ్యం కోసం తోడుగా తెచ్చుకున్నారు. అది చూసి సైనికులకు బాగా కోపం వచ్చింది.

సైనికుల ఆగ్రహం సరయినదే అని తేలిన తరువాత ఉస్మాన్ (ర), మహనీయ అబూ మూసాను తొలగించి ఆయన స్థానంలో అబ్దుల్లా బిన్ ఆమిర్ కురైషిని సేనాపతిగా నియమించారు. ఆయన వయస్సు అప్పుడు 25 సంవత్సరాలు. ఆయనకు తోడుగా అమ్మాన్ బహ్రైన్ సేనల్ని కూడా అందజేశారు. ఈ మార్పు వల్ల మహనీయ ఉస్మాన్, మనిషిని గుర్తించడంలో బాగా నైపుణ్యం గల వారని బోధపడుతుంది. అబ్దుల్లా బిన్ ఆమిర్ ఆ పైన ఎన్నో బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించారు.

## నియామకాలు, మార్పులు

ఆయన స్వయంగా ప్రతిభావంతులు కావడమే కాకుండా ఇతరుల ప్రతిభను సయితం గుర్తించి వారి ద్వారా పని రాబట్టడం కూడా ఆయనకు బాగా తెలుసు. అలా ఆయన విలువయిన సేవలనందించారు. ఆయనతోపాటు పని చేసిన కొందరు అధికారులు :

1. అస్వద్ బిన్ కుల్సూమ్, 2. అద్హమ్ బిన్ కుల్సూమ్, 3. కైస్ బిన్ హైసమ్, 4. అబ్దుల్లా బిన్ హాజిమ్, 5. అహ్నఫ్ బిన్ కైస్, 6. రబీ' బిన్ జియాద్, 7. అబ్దుర్రహ్మాన్ బిన్ సముర, 8. ముజాషి' బిన్ మస్ఊద్ సులమీ.

అబ్దుల్లా బిన్ ఆమిర్, విభిన్న ప్రాంతాలకు అధికారుల్ని నియమించడం, మార్పులు చేయడం ద్వారా పరిపాలనను పటిష్ఠపరిచారు. ఆ తరువాత ఆయన ఖలీఫా ఆదేశాల మేరకు, ఇతర సేనాధికారుల్ని సయితం, శాంతి స్థాపన నిమిత్తం, నలుదిశలా పంపారు. ఫలితంగా కుట్రలు, తిరుగుబాటు అలజడులు అణగారి ఉస్మానీ ఖిలాఫత్ పరిధులు దూర ప్రాచ్య ప్రాంతాల్లో చైనా సరిహద్దుల వరకు చేరాయి.

## సర్వ సమానత, న్యాయం

కూఫా గవర్నర్‌గా నియమితులయిన సోదరుడు, వలీద్ బిన్ ఉఖ్‌బా(ర) సారాయి త్రాగినట్లు రుజువు కావడంతో అతన్ని వెంటనే తొలగించి శిక్ష విధించారు. ఆయనకు బదులుగా మహనీయ సయీద్ బిన్ ఆస్‌ని కూఫా గవర్నర్‌గా నియమించారు. ఆ తరువాత ఒక సందర్భంలో ఆయన్ని కూడా తొలగించి ఆయన స్థానంలో మహనీయ అబూ మూసా అష్అరీని కూఫా గవర్నర్‌గా నియమించవలసి వచ్చింది.

మరో ఉదంతం కూడా చరిత్రకారులు ఉల్లేఖించారు. ఒకసారి ఆయనకు తన నౌకరు పైన కోపం వస్తే అతని చెవి మెలి పెట్టారు. అతనికి బాగా బాధ కలిగింది. ఆయన ఆందోళన చెందారు, వెంటనే నౌకరును పిలిపించి బదులు తీర్చుకునేందుకు తన చెవి మెలి పెట్టవలసిందని పురమాయించారు. నౌకరు నిరాకరిస్తే అతన్ని మందలించారు, గత్యంతరం లేక అతను మెలి పెట్టాడు!

★ ★ ★


### చందాదారులకు విజ్ఞప్తి

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.


వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు Screen Shot పంపి 9989903850 ఫోన్ చేయండి.

Geeturai Weekly
Account No:1042789768
Bank: Central Bank of India
Noorkhan Bazar Branch,
IFSC Code. CBIN0282407
Hyderabad- 500 002, Telangana

Office Address: Geeturai Weekly
Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar
Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com


## 'చరితార్థులు'-2



# హాజీ సాహెబ్ తురంగ్ జైయ్

## (1858-1937)

50




**బ్రిటిషర్లను** తమ ప్రాంతాల నుండి వెళ్ళగొట్టాలన్న లక్ష్యంతో సాయుధపోరు సాగించి ఆంగ్లేయ సైనికాధికారులకు కంటి నిండా నిద్ర లేకుండా చేసిన యోధులు హాజీ సాహెబ్ తురంగ్ జైయ్ 1858లో భారత వాయవ్య సరిహద్దు ప్రాంతంలోని చార్‌సద్దా తహసిల్‌లోని తురంగ జాయ్ గ్రామంలో జన్మించారు. ఆయనకు తల్లిదండ్రులు పెట్టిన పేరు ఫజలే వహిద్ / ఫజల్ అహద్ కాగా ప్రజలు ప్రేమతో పిలుచుకున్న పేరు 'హాజీ సాహెబ్ తురంగ్‌జైయ్'తో చరిత్ర ప్రసిద్ధులయ్యారు. ఆయన తండ్రి ఫైజ్ అహమ్మద్ వద్ద సాంప్రదాయక విద్య గరిపి ఉన్నత విద్యను దేవ్‌బంద్‌లోని దారుల్ ఉలూంలో చేశారు. ఆ పాఠశాలలోని ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు మౌలానా మహ్మూదుల్ హసన్ బ్రిటిష్ వ్యతిరేక భావజాలంతో ఆయన ప్రభావితులయ్యారు. 1887లో వాయవ్య సరిహద్దు ప్రాంతాలలోని పఠాన్ జాతులు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా సాగించిన పోరాటంలో ఆయన పాల్గొన్నారు. పఠాన్ జాతుల్లో సంస్కరణ, ఐకమత్యం–విద్యా వ్యాప్తి లక్ష్యాలుగా కృషి సాగించిన ఆయన సరిహద్దు గాంధీగా ప్రసిద్ధులైన ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్‌తో కలిసి ఆ పర్వతపానువుల్లో గల పలు గ్రామాలను సందర్శించారు. 1911 నుండి పలు ప్రాంతాలలో 'ఇస్లామిక్ పాఠశాల'లను ఏర్పాటుచేసి, పఠాన్ ప్రజానీకం ఆధ్యాత్మిక–సామాజిక జీవనంలో మార్పులకు అంకురార్పణ చేశారు. ఆయన ప్రయత్నాలకు భయపడిన ఆంగ్లేయాధికారులు సమాంతర ప్రభుత్వం నడుపుతున్నారని నేరారోపణ చేసి నిర్బంధించినా, నేరాన్ని రుజువుచేయలేక విడుదల చేశారు. 1915 ప్రాంతంలో గురువు మహ్మూదుల్ హసన్ మార్గదర్శకం మేరకు బ్రిటిష్ పాలకుల నుండి మాతృ భూమి విముక్తి కోసం పోరుకు సిద్ధం కాగా ఆయన అరెస్టుకు ప్రభుత్వం వారెంట్ జారీ చేసింది. బానిసత్వాన్ని సహించని పఠాన్ జాతి ప్రజలు, ఇతర ప్రాంతాల నుండి తరలి వచ్చే పోరాట యోధులతో కలసి ధర్మపోరాటానికి సన్నాహాలు ముమ్మరం చేశారు. ఆయన తన అనుచరులతో కలసి బ్రిటిష్ సైనిక స్థావరాల మీద దాడులు జరుపుతూ ఆంగ్ల ప్రభుత్వానికి సవాలుగా మారారు. 1923లో ఆయనను అడ్డుకునేందుకు ఆంగ్ల ప్రభుత్వం అదనపు బలగాలను పర్వత ప్రాంతాలకు పంపింది. ఆయన నిర్బంధానికి అధికారులు సన్నాహాలు సాగిస్తుండగా తన అనుయాయులతో కలసి, ఆంగ్లేయ గూఢాచారుల కళ్ళుగప్పి పర్వతపానుల్లోకి తప్పించుకున్నారు. 1930 వరకు తన అనుచరులతో కలసి ఆయన ఆంగ్లేయాధికారులకు కంటి మీద కునుకు లేకుండా చేశారు. 1932లో ఆంగ్లేయాధికారులు ఆయన నివాస గృహాన్ని బాంబులతో పేల్చివేశారు. 1936లో అస్వస్థతకు గురైన హాజీ సాహెబ్ తురంగజైయ్ 1937 డిసెంబరు 14న తనువు చాలించారు. ✤




**9440241727**


బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు' - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం




# ఊతకర్రల ప్రభుత్వాన్ని నడపగలరా?

- ఉమైర్

**కొన్ని నెలల క్రితం అయోధ్యలో** రామమందిర ప్రాణప్రతిష్ఠ జరిగింది. ఇక దేశవ్యాప్తంగా సెంటిమెంటు పనిచేస్తుందని, ఎన్నికల్లో భారీ విజయం తప్పక లభిస్తుందని బీజేపీ నేతలు అనుకున్నారు. కాని ఎన్నికల తర్వాత తెలిసిందేమిటంటే, అసలు రామమందిరం అనే సెంటిమెంటు ఎక్కడా లేనేలేదు. ఎగ్జిట్ పోల్ నాటకాలాడేవాళ్ళు ఈ విషయాలేవి కనిపెట్టలేరు. ఎందుకంటే, ఎగ్జిట్ పోల్ డ్రామాతో షేరు మార్కెటులో మదుపరుల కొంపముంచడంలో వాళ్ళు బిజీగా ఉన్నారు. కాని ఎగ్జిట్ పోల్ చెప్పలేకపోయిన చమత్కారం ఈ ఎన్నికల్లో జరిగిపోయింది. అదెలా జరిగిందో తెలియక బీజేపీ నేతలు ఇప్పుడు జుట్టు పీక్కుంటున్నారు. బీజేపీ బలం సగానికి సగం తగ్గిపోయినా సర్లే అని సరిపెట్టుకునేవాళ్ళు, బీజేపీకి స్వతంత్రంగా పూర్తి మెజారిటీ రాకపోయినా పోనీలెమ్మనుకునేవారు. కాని జరిగిందేమిటి? రామమందిరం, అయోధ్య ఉన్న ఫైజాబాద్‌లో బీజేపీ ఘోరపరాజయం పాలయ్యింది. ఇది తట్టుకోలేకపోతున్నారు. ఇక్కడ బీజేపీ తరపున రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన లల్లూ సింగ్ ఓడిపోయాడు. ఈ నియోజకవర్గం దళితుల కోసం రిజర్వు చేసిన నియోజకవర్గం కాకపోయినా, ఇక్కడ సమాజ్‌వాది పార్టీ నుంచి పోటీ చేసిన, దళిత సముదాయానికి చెందిన అభదేశ్ ప్రసాద్ చేతిలో 50 వేల ఓట్లతో ఓడిపోవడం చాలా మంది భరించలేకపోతున్నారు. జాతీయ చానళ్ళ పేరుతో స్టూడియోల్లో ఎగ్జిట్ పోల్ నాటకం నడిపిన భజన మీడియాకు అయోధ్యలో పరిస్థితి అర్థం కాలేదు. క్షేత్రస్థాయిలో ఎప్పుడైనా నిజమైన వార్తలు సేకరిస్తే కదా పరిస్థితి తెలిసేది. సినియర్ యాంకర్‌గా పిలువబడే దీపక్ చౌరాసియా అందుకే భరించలేక తన దుఃఖాన్ని ట్వీటు చేసి పంచుకున్నాడు. అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగి, టూరిస్టుల రాక పెరిగి, ఎకానమీ ఊపందుకుంటుంటే .... రాముడిని తీసుకువచ్చిన వారికే ఓటు వేయలేదేంటి? ఇదేమి ఘోరం అని వాపోయాడు. కాని అస్సలు ఈ నినాదమేమిటి? రాముడిని తీసుకువచ్చిన వారికి ఓటేయాలనడమేమిటి. ఇదేమన్నా వ్యాపారమా? ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో పుచ్చుకోడానికి. ఇది మర్యాద పురుషోత్తముడిగా పేరుపడిన శ్రీరాముడిని అవమానించడం కాదా? ఇది ప్రజలకు కూడా నచ్చలేదు. కాలిక్యులేషన్ దెబ్బతింది. కాని పెద్ద పెద్ద యాంకర్లకు, ఎడిటర్లకు స్టూడియోల్లో చర్చలు చేసేవారికి ఈ విషయాలు అర్థం కాలేదు. అయోధ్యలో 80 శాతం హిందువులున్నా కూడా బీజేపీ ఓడిపోయిందంటూ కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. అయోధ్యలో మాత్రమే కాదు దేశంలో చాలా ప్రాంతాల్లో హిందువులు 80 శాతానికి పైబడి ఉన్నారు. హిందువులైతే బీజేపీకే ఓటేయాలని బలవంత పెట్టడమేమిటి?

దేశంలో ఈ 80:20 ఫార్ములా అమలు చేయాలని బీజేపీ చాలా కాలంగా ప్రయత్నిస్తూనే వచ్చింది. హిందువులైనా కూడా బీజేపీకి ఓటేయాలని రూలేం లేదు. ఉత్తరప్రదేశ్‌లో 80 శాతం హిందువులున్నారు. తెలంగాణలో 85 శాతం ఉన్నారు. కర్నాటకలో 84 శాతం ఉన్నారు. కేరళలో 65 శాతం ఉన్నారు. తమిళనాడులో 88 శాతం ఉన్నారు. రాజస్థాన్‌లో 89 శాతం ఉన్నారు. పశ్చిమ బెంగాల్లో 81 శాతం ఉన్నారు. ఈ రాష్ట్రాల్లో వాళ్ళంతా బీజేపీకి ఓటేయడం లేదు. అయోధ్యలో 80 శాతం హిందువులున్నా బీజేపీ ఓడిపోవడమేంటని బాధపడుతున్న వాళ్ళు అర్థం చేసుకోవలసిందేమిటంటే, హిందువులైతే తప్పని సరిగా బీజేపీకే ఓటు వేయాలనే ఈ ఒత్తిడి రాజకీయాలనే ప్రజలు ఏవగించుకున్నారు. ఈ హిందుత్వ ప్రయోగం ఇప్పుడు విఫలమవుతోంది. బీజేపీ ఐటి సెల్ చేసే అతి వ్యవహారాలతో చాలా మంది విసిగిపోతున్నారు. ట్విటరులో ఆగ్రహావేశాల, తిట్ల పురాణాల ట్వీట్లు కనిపిస్తాయి. ఈ ట్వీట్లలో హిందువులపై ఆగ్రహావేశాలు, బీజేపీని ఓడించారనే ద్వేషం కనిపిస్తోంది. స్వంత పేరు కూడా లేని సోషల్ మీడియా ఖాతాలతో ఈ ప్రచారం చేస్తుంటారు. ఇలాంటి వాళ్ళు హిందూ ధర్మాన్ని కాపాడేస్తున్నామంటుంటారు. హిందువులు ప్రమాదంలో ఉన్నారు కాబట్టి మోడీకి ఓటేయమన్నారు. మోడీకి ఓటేయకపోతే అసలు హిందువే కాదు పొమ్మంటున్నారు. అలా హిందూధర్మాన్ని మోడీతో లింక్ చేసే ప్రయోగం, మంచి హిందువులు కేవలం మోడీకే ఓటేస్తారనే ప్రచారం ఇప్పుడు బెడిసికొట్టింది. చాలా మంది హిందువులు దీన్ని వ్యతిరేకించారు. అయోధ్యలో బీజేపీ ఓడిపోవడానికి ఇంకో పెద్ద కారణం ఉంది. ఈ కారణం స్టూడియోల్లో కూర్చున్న పెద్ద పెద్ద గోదీ మీడియా యాంకర్లకు తెలియదు. కాని క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న సగటు రిపోర్టర్లకు బాగా తెలుసు. ఎందుకంటే ఈ గోదీ యాంకర్లు నిజాలు ఎప్పుడు ప్రజలకు చూపించలేదు. తెలుసుకునే ప్రయత్నమూ చేయలేదు. అందుకే ఇప్పుడు ముఖాలు చూపించలేని పరిస్థితిలో ఉన్నారు. గోదీ యాంకర్లంటే ఏమిటో ఇప్పుడు ప్రజలకు స్పష్టంగా అర్థమయ్యింది. సాధారణ రిపోర్టర్లకు అయోధ్యలో ఏం జరిగిందో బాగా తెలుసు. అయోధ్యలో రాంపథ్ నిర్మాణానికి 2200 కన్నా ఎక్కువ దుకాణాలు, 800 ఇళ్ళు, 30 గుళ్ళు, 9 మస్జిదులు కూల గొట్టారు. ఈ రామ్‌పథ్‌కు అయోధ్యలో రామమందిరానికి ఎలాంటి సంబంధమూ లేదు. టూరిస్టుల రాకపోకలకు సౌలభ్యం కల్పించడం కోసం చేసిన పని. ఈ క్రమంలో స్థానికులు అనేక కష్టాల పాలయ్యారు. కాని ప్రభుత్వం పట్టించుకోలేదు. అయోధ్యలో కరసేవలో పాల్గొన్న అనేక కుటుంబాలు కూడా ఇప్పుడు రోడ్డున పడ్డాయి. ఇళ్ళు, దుకాణాలు కూల్చారే కాని పునరావాసం, నష్టపరిహారాలు ఏవీ ఇవ్వలేదు. అనేక మంది ముసలివారు ఇప్పుడు వృద్ధాశ్రమాల్లో తలదాచుకునే పరిస్థితి వచ్చింది. ఇది బుల్డోజర్ రాజ్యం. ముస్లిముల ఇండ్లను, దుకాణాలను బుల్డోజర్లతో కూల్చిన దృశ్యాలు దేశం చాలా చూసింది. కాని వీటిని మాత్రం గోదీ మీడియా చూపించలేదు. ఇలాంటి పనులు చేస్తే ఆ మర్యాద పురుషోత్తముడు మన్నిస్తాడా? పైగా ఇక్కడ పెద్దస్థాయిలో భూమి దురాక్రమణలు, కుంభకోణాలు కూడా జరిగాయి. బయటి వాళ్ళు వచ్చి అక్కడ భూములు కొనేసి, అధిక ధరలకు అమ్మేసే వ్యాపారం పెద్ద ఎత్తున జరుగుతోంది. పెద్ద పెద్ద కార్పోరేట్లు అడుగుపెడుతున్నారు. ఇక్కడ ఇప్పుడు పెద్ద పెద్ద హౌసింగ్ ప్రాజెక్టులు కట్టబోతున్నారు. శ్రీరాముడి పేరుతో జరుగుతున్న ఈ వ్యాపారాలను ప్రజలు గుర్తించారు. మతం పేరు చెప్పి నడిపిన రాజకీయాలను సమాజవాది పార్టీ కుల సమీకరణాలతో చిన్నాభిన్నం చేసింది. స్థానిక సమస్యలను, ప్రజాసమస్యలను ప్రజల్లో ప్రచారం చేసి ఈ మతరాజకీయాలకు సవాలు విసిరింది. పరీక్షా పత్రాల లీకు సమస్య కుదిపేస్తోంది. నిరుద్యోగంతో యువత ఆగ్రహిస్తోంది. ఈ పరిస్థితులుంటే ఎగ్జిట్ పోల్ నాటకాలతో గోదీ మీడియా స్టూడియోలో ఎంటర్‌టైన్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహించింది. రామమందిరం పేరుతో బీజేపీ నడుపుతున్న రాజకీయాలను ప్రజలు గుర్తించారు. ఉత్తర ప్రదేశ్‌లో, అయోధ్యలో 80 శాతం హిందువులున్నారన్నది నిజమే. కాని వారిలో అత్యధికులు విద్వేష రాజకీయాలను ఏవగించుకుంటున్నారు. గంగా జమునా తెహజీబ్‌కు పుట్టినిల్లు ఉత్తర ప్రదేశ్. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు ఇవ్వకుండా, అధిక ధరలను అదుపు చేయకుండా కేవలం రామమందిరం పేరు చెబితే చాలు హిందువులు ప్రతి ఎన్నికలో ఓటేస్తారని భావించిన వాళ్ళకు ఓటర్లు తగిన బుద్ధి చెప్పారు. మోదీ ఇప్పుడు మరలా ప్రధాని అయినా మునుపటి మాదిరిగా ఇష్టారాజ్యం చెలాయించే పరిస్థితి లేదు. సంకీర్ణ రాజకీయాల్లో నితీష్ కుమార్, చంద్రబాబులతో సహా అనేక పార్టీలను బుజ్జగిస్తూ ప్రభుత్వాన్ని నడపాలి. ప్రజలు ఇచ్చిన సందేశం ఇదే. బయోలాజికల్ కాదని, తానే అవతార పురుషుడినంటూ చెప్పిన మాటలను ప్రజలు తిప్పి కొట్టారు. బెనారస్‌లో కూడా వె డికి లభించిన మెజారిటీ చాలా తక్కువ. అవతారపురుషుడిగా చెప్పుకోవడమే కాదు రామమందిరం సందర్భంగా వచ్చిన ప్రకటనల్లోను శ్రీరాముడి కన్నా పెద్ద సైజులో మోడి ఫోటోలు, హోర్డింగుల్లోను ఇదే పరిస్థితి. ఇది శ్రీరాముడిని అవమానించడం కాదా? జై శ్రీరాం అనకపోతే పాకిస్తాన్‌కు పొండి అంటూ బీజేపీ నేతలు చేసే ప్రసంగాలను, వ్యాఖ్యలను కూడా ప్రజలు తిరస్కరించారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి తీవ్రమైన హెచ్చరిక చేశారు. అధికారం ఇచ్చారు కాని ఊత కర్రలతో నడిచే అధికారాన్నిచ్చారు. వార్నింగ్ ఇచ్చి సరిగా ప్రభుత్వాన్ని నడపమన్నారు. ఇప్పుడు ప్రజలు బీజేపీ చెప్పే హిందుత్వకు, హిందూ ధర్మానికి మధ్య తేడా గుర్తిస్తున్నారు. ప్రజలను టేకెన్ ఫర్ గ్రాంటెడ్ అనుకుంటే ఇలాగే బుద్ధి చెబుతారు. ✤



# మహల్లాలో ప్రయత్నాలు

(కార్యకర్తల నమోదు ఉద్యమం సందర్భంగా)

- ఖాలిద్ ముబష్శిర్ జఫర్,
అధ్యక్షులు
జమాఅతె ఇస్లామీ హింద్, తెలంగాణ

**మనిషికి తన తల్లిదండ్రులు, తన సంతానం, తన సన్నిహిత బంధువుల తర్వాత తన వీధిలో, తన మహల్లాలో ఉంటున్న ఇరుగు పొరుగుతో దగ్గరి సంబంధం ఉంటుంది. మహల్లాలో, వీధిలో ఉంటున్న ఇతర కుటుంబాల పిల్లలు, మహిళలు ఫ్యామిలీ ఫ్రెండ్స్‌గా ఉంటారు. ఇళ్ళకు రాకపోకలు జరుగుతుంటాయి. కొన్ని సందర్భాల్లో బంధుత్వ సంబంధాలకన్నా ఈ ఇరుగు పొరుగు సంబంధాలే చాలా పటిష్టంగా ఉంటాయి. ఇరుగు పొరుగుతో, వీధిలో ఉంటున్న వారితో సంబంధాలు చక్కగా ఉంటేనే ఆ వీధిలో, ముహల్లాలో ప్రశాంతత, స్నేహం, శిక్షణ సంస్కరణలకు చక్కని వాతావరణం ఏర్పడుతుంది. కాబట్టి జమాఅతె ఇస్లామీ హింద్ సభ్యులు, కార్యకర్తలు తమ ముహల్లాలో, తమ ఇరుగు పొరుగు వారితో చక్కని స్నేహసంబంధాలు కలిగి ఉండి, జమాఅత్‌ను పరిచయం చేయడంతోపాటు జమాఅత్ ఉద్దేశ్య లక్ష్యాలకు అవసరమైన మానవ వనరుల సేకరణకు పని చేయగలరు.**

ఇస్లామ్ ఇరుగు పొరుగు వారికి ఎంతో ప్రాముఖ్యం ఇచ్చింది. ఇస్లాముకు ముందు కాని, ఇస్లామ్ తర్వాత కాని ఇరుగు పొరుగు వారికి ఇలాంటి ప్రాముఖ్యాన్ని ఇతరులెవ్వరు ఇవ్వలేదు. ఏ వ్యవస్థ కూడా ఇవ్వలేదు. కాబట్టి సత్యధర్మ సందేశ ప్రచారంలో ఇరుగు పొరుగుకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి. కాని ఏ ప్రాంతంలో మనం ఉంటున్నామో ఆ ప్రాంతంలో నివసిస్తున్న మన వీధివారితో, మన ముహల్లా వారితో స్నేహసంబంధాలు లేకపోవడం శోచనీయం. ఇరుగు పొరుగుతో చక్కని వ్యవహారశైలి కలిగి ఉండాలని అల్లాహ్ దివ్య ఖుర్‌ఆన్‌లో బోధించాడు: “మీరంతా అల్లాహ్‌కు దాస్యం చెయ్యండి. ఎవరినీ ఆయనకు భాగస్వాములుగా చేయవద్దు. తల్లిదండ్రుల ఎడల సద్భావంతో మెలగండి. బంధువులూ, అనాథులూ, నిరుపేదల పట్ల మంచిగా వ్యవహరించండి. పొరుగున ఉన్న బంధువులు, అపరిచితులయిన పొరుగువారు, ప్రక్కనున్న మిత్రులు, బాటసారులు, మీ అధీనంలో ఉన్న దాసదాసీ జనం పట్ల ఉదారబుద్ధితో వ్యవహరించండి. గర్వాతిశయంతో కన్నూమిన్నూ కాననివారు, తమ గొప్పతనం గురించి విర్రవీగేవారు అంటే అల్లాహ్ ఇష్టపడడు అని గట్టిగా నమ్మండి.” (నిసా 36). ప్రవక్త ముహమ్మద్ (స) ఇరుగుపొరుగుతో చక్కని వ్యవహారశైలి కలిగి ఉండాలని బోధించారు. ఇరుగుపొరుగుకు కష్టం కలిగించకుండా చక్కని వ్యవహారశైలి కలిగి ఉండడం అనేది అల్లాహ్‌ను, పరలోకాన్ని విశ్వసించడానికి చిహ్నంగా చెప్పారు. ఆయన ఏమన్నారంటే -

"ఎవరైతే అల్లాహ్‌ను, తీర్పుదినాన్ని విశ్వసిస్తారో వాళ్ళు ఇరుగు పొరుగుతో మంచి వ్యవహారశైలి కలిగి ఉండాలి. అల్లాహ్‌ను తీర్పుదినాన్ని విశ్వసించే వ్యక్తి తన అతిథులను గౌరవించాలి. అల్లాహ్‌ను తీర్పుదినాన్ని విశ్వసించే వ్యక్తి మంచి మాటలే పలకాలి లేదా మౌనంగా ఉండాలి." (బుఖారి, ముస్లిం)

జమాఅతె ఇస్లామీ హింద్ అంటే ఇలాంటి మార్పులు సమాజంలో తీసుకువచ్చే ఉద్యమం. మనిషి, మానవ నాగరికతల పునాదులు సమైక్యత, పరస్పర సహకారాలపై ఎలా ఆధారపడి ఉన్నా, ఏ విధంగా ప్రపంచంలో ప్రతి మనిషి మరొకరి సహాయ సహకారాలపై ఆధారపడి ఉంటాడో, ఏ విధంగా మనుషులు పరస్పర సహకారంపై ఆధారపడి జీవితం గడుపుతున్నారో అదేవిధంగా జమాఅతె ఇస్లామీ హింద్ కూడా లక్ష్యబద్ధులైన కార్యకర్తల సమైక్య ప్రయత్నాలపై కొనసాగుతోంది. ఇస్లామీయ నైతిక వ్యవస్థకు కట్టుబడడంతోపాటు యావత్తు మానవాళి సోదరభావం, ప్రేమాభిమానాలు, హక్కులు బాధ్యతల స్పృహతో చక్కని సామాజిక వాతావరణాన్ని స్థాపించాలని కోరుతుంది. ఎలాంటి వాతావరణమంటే "వాళ్ళు స్వయంగా తమకు అవసరాలు ఉన్నప్పటికీ, తమ కన్నా ఇతరులకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు." - ఇలాంటి వ్యక్తులతో సమాజాన్ని నిర్మించాలనుకుంటుంది.

రండి- జమాఅతె ఇస్లామీ హింద్ ప్రయత్నాల నేపథ్యంలో మన ముహల్లా, మన వీధి, మన ఇరుగు పొరుగులో స్నేహ సంబంధాలు, లక్ష్యబద్ధమైన పరస్పర సహకారం కోసం మంచి సంబంధాల గురించి చర్చిద్దాం.

## శ్రేయోభావం

ముస్లిం ఎలా ఉండాలి? తాను మాత్రం హాయిగా జీవిస్తూ ఇరుగు పొరుగు దుఃఖాలను, కష్టాలను పట్టించుకోకుండా జీవించడం ముస్లింకు శోభించదు. తన పొరుగువాళ్ళు ఆకలితో ఉంటే తాను కడుపు నిండా తినేవాడు ముస్లిం కాదని ప్రవక్త ముహమ్మద్ (స) అన్నారు. ఇరుగుపొరుగు ఆకలిదప్పులను పట్టించుకోకుండా, ఇరుగుపొరుగులో జీవిస్తున్న వారి సమస్యలు, కష్టాల గురించి ఆలోచించకుండా జీవించడాన్ని ప్రవక్త మహనీయులు ఎంత తీవ్రంగా ఖండించారో దీన్ని బట్టి అర్థమవుతుంది.

## కానుకలివ్వడం ప్రేమను పెంచే మార్గం

ఇరుగు పొరుగుతో ప్రేమాభిమానాలు పెంచుకోడానికి మంచి పద్ధతి కానుకలు ఇచ్చి పుచ్చుకోవడం. ప్రవక్త ముహమ్మద్ (స) ఈ విషయం ముస్లిముల మాతృమూర్తులకు కూడా చెప్పేవారు. ఒకసారి హజ్రత్ ఆయెషా (రజి) "ప్రవక్తా, నా ఇద్దరు పొరుగు వారిలో ఎవరికి ఎక్కువగా నేను కానుకలు పంపాలి" అని అడిగారు. దానికి ప్రవక్త జవాబిస్తూ "ఎవరి గుమ్మం నీ ఇంటికి దగ్గరగా ఉందో వారికి" అన్నారు (మిష్కాత్). ఇరుగు పొరుగు మధ్య మంచి సంబంధాలు ఉండాలంటే కానుకలు ఇచ్చి పుచ్చుకోవడం జరుగుతూ ఉండాలి. కానుకలు ఇవ్వాలంటే చాలా ఖరీదైన, పెద్ద పెద్ద వస్తువులు ఇవ్వాలని అనవసరపు ఆంక్షలు పెట్టుకోరాదు. మామూలు వస్తువులైనా కానుకగా ఇచ్చి పుచ్చుకోవడంలో సంకోచం ఉండరాదు. ప్రవక్త ముహమ్మద్ (స) మహిళలను ఉద్దేశించి ఇలా చెప్పారు: "ఓ ముస్లిం మహిళలారా, ఒక మేకగిట్ట కానుకైనా సరే దాన్ని తక్కువగా చూడకండి"

(బుఖారి, ముస్లిం)

## పరస్పర సహకారం

నగరంలో కాని, ఊరిలో కాని ముహల్లా లేదా వీధి అనేది ఒక చిన్న ప్రాంతం. గతంలో వీధిలో ఉన్నవారందరితోను ప్రతి ఒక్కరికి చక్కని స్నేహం ఉండేది. అందరికీ అందరూ తెలిసి ఉండేవారు. ఆధునిక కాలంలో ఈ సంబంధాలు బలహీనమైపోయాయి. దీని వల్ల అనేక పౌరసమస్యలు, ఇబ్బందులు పుట్టుకువచ్చాయి. ప్రవక్త ముహమ్మద్ (స) చెప్పిన మాటల ప్రకారం పొరుగువాళ్ళు ఆకలితో ఉంటే మనం కడుపునిండా తినడం ధర్మసమ్మతం కాదు. (మస్నద్ అహ్మద్) మనలో ప్రతి ఒక్కరిపై పొరుగువారికి కొన్ని హక్కులున్నాయి. వ్యాధికి గురైతే పరామర్శించడం, డబ్బు అవసరమై రుణం కోరితే రుణాన్నివ్వడం, పొరుగువారి సంతోషాల్లో పాలుపంచుకుని వారికి శుభాకాంక్షలు చెప్పడం, కష్టాల్లో ఉంటే వారిని ఓదార్చడం, సలామ్ చేసి పలకరించడం, మృదువుగా మాట్లాడడం ఇవన్నీ పొరుగువారికి ఉన్న హక్కులు.

## పరిశుభ్రత పారిశుధ్యాలు

పరిశుభ్రత పాటించాలని ఇస్లామ్ నొక్కి చెప్పింది. కాని ఇంటిని శుభ్రపరిచి చెత్త తీసుకెళ్ళి కొందరు వీధిలో పారేస్తారు. ప్రవక్త

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ముహమ్మద్ (స) ఇలా చేయడాన్ని నిషేధించారు. ఒక హదీసులో ప్రవక్త ఇలా చెప్పారు: "మీ ఇంటి ముందు భాగాన్ని కూడా శుభ్రంగా ఉంచండి. యూదుల పద్ధతి పాటించకండి. వాళ్ళు ఇంటి ముందు భాగాన్ని శుభ్రపరిచేవారు కాదు". (సునన్ తిర్మిజి)

## విద్యాశిక్షణలు

ఇరుగు పొరుగు శిక్షణ సంస్కరణల గురించి కూడా ప్రవక్త ముహమ్మద్(స) బోధించారు. ఇరుగుపొరుగులో పేదవాళ్ళు ఉంటే వాళ్ళు ధార్మిక శిక్షణను పొందలేని వారైతే వారి విద్యా శిక్షణల ఏర్పాట్లు చేయడం ఆ ముహల్లాలోని ఇతరుల బాధ్యత అవుతుంది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "మీరంతా అల్లాహ్‌కు దాస్యం చెయ్యండి. ఎవరినీ ఆయనకు భాగస్వాములుగా చేయవద్దు. తల్లిదండ్రుల ఎడల సద్భావంతో మెలగండి. బంధువులూ, అనాథులూ, నిరుపేదల పట్ల మంచిగా వ్యవహరించండి. పొరుగున ఉన్న బంధువులు, అపరిచితులయిన పొరుగు వారు, ప్రక్కనున్న మిత్రులు, బాటసారులు, మీ అధీనంలో ఉన్న దాసదాసీ జనం పట్ల ఉదారబుద్ధితో వ్యవహరించండి." (నిసా 36).

ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారు, అల్లాహ్‌ను తీర్పుదినాన్ని విశ్వసించేవారు పొరుగువారి పట్ల మంచి వ్యవహార శైలి కలిగి ఉండాలి (ముస్లిం).

అల్లాహ్ ఆదేశాలు, ప్రవక్త ముహ మ్మద్ (స) బోధనల ప్రకారం ధార్మిక, ప్రాపంచిక వ్యవహారాల్లో పొరుగువారికి సహాయ సహకారాలు అందించాలి. పొరుగువారి తప్పులు ఎంచడానికి ప్రయత్నించరాదు. పొరుగువారి పొరబాట్లను చూసీ చూడక వదిలేయాలి. ఇవన్నీ ఇరుగుపొరుగు పట్ల మంచి వ్యవహారశైలి కిందికి వస్తాయి.

## సత్యసందేశ ప్రచారం

ఇరుగు పొరుగువారికి సత్యసందేశాన్ని అందజేయడం సందేశ ప్రచారకులు నిష్ఠగా చేయవలసిన పని. అందువల్ల స్థిరంగా, బాధ్యతగా, నిరంతరంగా ఈ పని చేస్తూ ఉండాలి. కార్యక్రమాలను అర్థాంతరంగా వదిలేయడం, కొత్త కొత్త కార్యక్రమాలు రూపొందించడం సత్యసందేశ ప్రచారం పట్ల నిబద్ధత లేకపోవడాన్ని సూచిస్తుంది. పరస్పర సహకారంతో కొద్దిపాటి పని చేసినా అది నిరంతరం చేస్తూ ఉండాలి. ప్రవక్త హదీసుల్లో ఇరుగుపొరుగు పట్ల మంచి సంబంధాలను నొక్కి చెప్పడం జరిగింది. ఇరుగు పొరుగు ఎవరైనా కావచ్చు. ముస్లిముల కోసమే అని ప్రత్యేకంగా చెప్పడం జరగలేదు. ప్రవక్త ముహమ్మద్ (స) ముస్లిమేతరులైనా ఇరుగుపొరుగువారితో చక్కని వ్యవహారశైలి ప్రదర్శించేవారు. అందువల్ల పొరుగు వారు ముస్లిమేతరులైనా సరే మంచి వ్యవహారశైలి, మృదు భాషణాన్ని ఇస్లామ్ ప్రోత్సహిస్తుంది. పొరుగువారు కష్టాల్లో ఉంటే వారికి సహాయపడాలి. పొరుగువారికి కష్టం కలిగేలా వ్యవహరించరాదు.

## ఆచరణాత్మకంగా సత్యానికి సాక్ష్యం పలకడం

ఒక మంచి పొరుగు అంటే తన ఆచరణలతో, నైతికతతో, వ్యక్తిత్వంతో తన ఇరుగుపొరుగును ప్రభావితం చేసే వ్యక్తి. మనం చేసే పనులకు, మన వ్యక్తిత్వానికి, మన నడవడికకు మనం చెప్పే మాటలకు పొంతన లేకపోతే మనం చెప్పే మాటలకు విలువ ఉండదు. పొరుగువారికి ఎలాంటి కష్టాన్ని, మాటల ద్వారా కాని, చేతల ద్వారా కాని కలిగించకుండా ఉండడం అనేది మంచి వ్యవహారశైలి. ఏ వ్యక్తి అయినా మంచివాడా, చెడ్డవాడా అన్నది పొరుగువారు చెప్పే మాటలను బట్టి తెలిసిపోతుంది. ఒకసారి ప్రవక్త ముహమ్మద్(స)తో ఒక వ్యక్తి ఇలా అడిగాడు, " ఓ ప్రవక్తా, నేను మంచిపని చేశానా, చెడ్డపని చేశానా అనేది ఎలా తెలుసుకోవాలి?", దానికి ప్రవక్త జవాబిస్తూ నీ పని గురించి పొరుగువారు మంచి పని చేశాడని చెప్పడం నువ్వు వింటే అది మంచి పని, నువ్వు చేసిన పని చెడ్డపని అని పొరుగువారు చెప్పడం వింటే నువ్వు చేసింది చెడ్డపని అన్నారు (ఇబ్నె మాజా). పొరుగువారు నిశ్చింతగా ఉండలేకపోతే ఆ ముస్లిం విశ్వాసభాగ్యాన్ని పొందలేదని ప్రవక్త ముహమ్మద్ (స) చెప్పారు. అలాంటి వ్యక్తి స్వర్గప్రవేశం పొందలేడు. మరో హదీసులో ప్రవక్త ముహమ్మద్(స) మూడు సార్లు దైవంపై ప్రమాణం చేసి మరీ ముస్లిము కాదని చెప్పిన వ్యక్తి ఎవరంటే, ఎవరి చేష్టల వల్ల పొరుగువాళ్ళు భద్రంగా ఉండలేరో ఆ వ్యక్తి. (ముస్లిం)

## జమాఅత్‌ను పరిచయం చేయడం

జమాఅతె ఇస్లామీ హింద్‌తో మన సంబంధం, మన ప్రయత్నాలకు అసలు ప్రేరణ దైవ ప్రసన్నతను పొందడం. పరలోక సాఫల్యాన్ని పొందడం. అంటే మనం ఇష్టపూర్వకంగా ఈ మార్గాన్ని ఎన్నుకున్నాం. జమాఅత్‌తో మన సంబంధం మనకు శాశ్వత సాఫల్య మార్గాన్ని సులభతరం చేస్తుందని మనం విశ్వసిస్తున్నాం. కాబట్టి జమాఅత్‌తో సంబంధమున్న వారంతా ప్రవక్త ముహమ్మద్ (స) చెప్పిన ఈ మాటలను తప్పక ఆచరణలో పెట్టాలి- "మీరు మీ కోసం ఏది ఇష్టపడతారో అదే మీ తోటివారి కోసం ఇష్టపడనంత వరకు మీరు విశ్వాసులు కాలేరు"

అల్లాహ్ మనకు ఈ విషయాలను ఆలోచించి, అర్థం చేసుకుని ఆచరించే భాగ్యం ప్రసాదించాలని వేడుకుంటున్నాను.

# సహనం...
## ఒక అమూల్య సంపద

**- పోలంకి విజయభాస్కర్**

**సహనం** అంటే నిగ్రహ శక్తి. మానసిక పరిపక్వత గల స్థితి. ఈ గుణం కలిగినవారు ఎల్లవేళలా నిశ్చలంగా ఉండగలరు. వారు జీవితంలో ఎదురయ్యే సమస్యలన్నింటినీ సులభంగా పరిష్కరించ గలుగుతారు. సహనం మనిషిని ఆలోచింపజేస్తుంది. మనిషిని ఆవేశ పడకుండా ఆపుతుంది. మనిషిని ఉన్నత మార్గంలో నడిపిస్తుంది. సహనం ఒక అమూల్య సంపద. అందుకే ఈ సుగుణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ విడవకూడదు. ప్రతి మనిషికి తన దైనందిన వ్యవహారాల్లో ఎన్నో సమస్యలు ఎదురవుతుంటాయి. మనిషి నిగ్రహశక్తిని పాటించాలి. ఎందుకంటే జీవితం వడ్డించిన విస్తరి కాదు. జీవితమంతా కష్టసుఖాలు, మంచి చెడులు, గెలుపోటములు కొనసాగుతుంటాయి. మన జీవితంలో చేసే పోరాటాలలో ఎప్పుడైతే సహనాన్ని అలవరచుకుంటామో, అక్కడే జీవిత పరమార్థాలు దొరుకుతాయి.

నేటి సమాజంలో అభివృద్ధికి, శాంతి స్థాపనకు సహనం అత్యంత ఆవశ్యకం. ముఖ్యంగా సహనం మనిషి సౌశీల్యానికి, మంచితనానికి, ఇతరుల పట్ల గౌరవం, ప్రేమ, వాత్సల్యాలకు నిదర్శనం. సర్వ మానవాళికి రుజుమార్గ ధర్మాన్ని బోధించి, ఆచరించి ఆదర్శంగా నిలిచిన గొప్ప సహనమూర్తి. శాంతిదూత అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స). ఈ ప్రపంచంలో ఎన్నో కోట్ల మందిని ప్రభావితం చేసిన, చేస్తున్న జీవితం ఆయనది. ఆయన(స) జీవితం ప్రవహిస్తున్న జీవ నది లాంటిది. ఆయన(స) సహనం తీరం లేని సాగరం వంటిది. కాబట్టి ఆయన(స) చూపిన మార్గంలో మనం నడిచే ప్రయత్నం చేయాలి.

ఆనాడు అరేబియా దేశమంతటా ఉచ్చనీచాలు, అంటరానితనం, స్త్రీలపై అత్యాచారాలు, మత్తు పానీయాలు, జూదం, వడ్డీ, కొట్లాటలు వంటి అనేకానేక చెడులు ప్రబలి ఉండేవి. అలాంటి విపత్కర పరిస్థితుల్లో అంటే, అజ్ఞానంతో కొట్టుమిట్టాడుతున్న, మూఢ నమ్మకాలతో తమ మనుగడను ప్రశ్నార్థకం చేసుకుంటున్న ప్రజలకు దివ్య సందేశాన్ని అందించిన ప్రవక్త ముహమ్మద్(స). సత్యం ఎప్పుడూ ఒక్కటే... అసత్యాలు అనేకం ఉండవచ్చు. సత్యధర్మం మాత్రం ప్రారంభం నుండి ఒక్కటే. ధర్మం ఎన్నటికీ మారదు. ఇది సర్వ మానవాళి కోసం నిర్దేశించిన ధర్మం. దీన్ని విశ్వసించిన ప్రతి ఒక్కరిపై దీన్ని వ్యాపింపజేసే బాధ్యత విధిగావించబడింది. "మానవులంతా ఒక్కటే- దేవుడొక్కడే" అంటూ సందేశ ప్రచారం మొదలు పెట్టినప్పుడు, ఆయన(స)ను అప్పటివరకూ ఆదరించినవారే, సత్యసంధులని చెప్పిన మక్కావాసులే ఆయన బోధనలకు వ్యతిరేకులయ్యారు. ఆయన ఎంతో సహనంతో సత్యధర్మం వైపునకు పిలుస్తుంటే.. అంతకు రెట్టింపు ఆయన పట్ల శత్రుత్వం పెంచుకున్నారు. ముస్లింలుగా మారిన వారిని వేదించినా, కొట్టినా, అగ్నిపై పడుకోబెట్టినా, మెడలో తాడు వేసి లాక్కొని వెళ్ళినా, రాళ్ళు విసిరి కొట్టినా... ఆయన(స) ఎంతో సహనంతో ప్రతి ఒక్కరి గురించి ప్రార్థించారే గాని ప్రతీకారం తీర్చుకోలేదు.

ఒకసారి ఆయన(స) మక్కా వాసులతో నిరాశ చెంది 'తాయిఫ్' అనే నగరానికి వెళ్ళారు. అక్కడి ప్రజలు ఆ మహా పురుషుడ్ని ఆదరించకపోగా... ఆకతాయి కుర్రాళ్ళను ఉసిగొలిపి ఆయనపై రాళ్ళు రువ్వేలా చేశారు. శరీరమంతా రక్తసిక్తమయ్యింది. పాదరక్షలు సైతం రక్తంతో నిండిపోయాయి. ఎక్కడైనా కాసేపు కూర్చుందామనుకున్నా ఆ ఆకతాయి కుర్రాళ్ళు వెంబడించి మరీ రాళ్ళతో కొట్టేవారు. అలాంటి పరిస్థితిలో దైవప్రవక్త(స) ఆ నగరం దాటి వచ్చి, ఒక చెట్టు కింద కూర్చొని... వారిని శపించకుండా వారి కోసం దుఆ చేశారు.

"ఓ ప్రభూ! వారికి సద్బుద్ధిని ప్రసాదించు. వారు ఏమీ చేస్తున్నారో వారికి తెలియదు" అని ప్రార్థించారు.

కాలక్రమంలో... దాదాపు 23 సంవత్సరాల కఠిన పరిశ్రమ అనంతరం ఆయనకు విజయం లభించింది. మక్కా విజయం తరువాత ప్రవక్త(స) సర్వ సామాన్యమైన మన్నింపును ప్రకటించారు. నిస్సహాయులై తన ముందు నిలబడి ఉన్న శత్రువులను ఉద్దేశించి "చెప్పండి! ఈ రోజు నేను మీ పట్ల ఎలా వ్యవహరించాలి?" అని ప్రశ్నించారు. "తమరు ఉత్తములు... తమరి నుండి మేలునే ఆశిస్తాము. ఉత్తముడైన సోదరుని నుంచి మంచిని తప్ప మరేమీ ఆశించలేము"అని సమాధానమిచ్చారు ఖురైషులు. అప్పుడు ప్రవక్త(స) 'వెళ్ళండి, ఈ రోజు మీపై ఎలాంటి నిందా లేదు. ఇక మీరు స్వతంత్రులు" అన్నారు. ఔదార్యం వర్షించిన ఆ వేళ... కరకు గుండెలు కరిగాయి. నిన్నటి దాకా శత్రువులుగా ఉన్నవారు మిత్రులుగా మారిపోయారు.

శత్రువులను సైతం మన్నించిన ఆయన(స) క్షమాగుణం... సహనం నేటి సమాజంలో ఎక్కడైనా కన్పిస్తుందా?

ఆది నుంచి అంత్య దశకు ఆయన(స) ఒక్కో కీలకమైన ఘట్టాన్ని అత్యంత నిగ్రహంతో...సడలని ఆత్మ విశ్వాసంతో.. పట్టుదలతో అధిగమించారు. దేవుని నుండి ఆయన పొందిన జ్ఞాన సంపద, బోధనల ద్వారా ప్రజలు దైవానికి ఆత్మ సమర్పణ చేయటానికి ప్రేరేపించిన ఆయన తపన, మానవాళి మనుగడకు మార్గనిర్దేశనం అయ్యింది. ఆయన చేసిన సేవకు మానవజాతి యుగయుగాల వరకు రుణపడి ఉంటుంది. ❖

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**89 ఆయత్‌లు**

# 43. అజ్ జుఖ్రుఫ్

23 – 25 ఇదేవిధంగా నీకు పూర్వం ఏ జనావాసంలోనయినా మేము భయపెట్టేవాడిని పంపినప్పుడల్లా దాని స్థితిపరులయిన జనులు ఇదే మాట అన్నారు, మేము మా తాతముత్తాతలను ఒక విధానాన్ని అవలంబించడాన్ని గమనించాము. మేము వారి అడుగుజాడలనే అనుసరిస్తున్నాము.[23] ప్రతి ప్రవక్తా వారిని అడిగాడు, మీ తాతముత్తాతలు అనుసరించిన ఆ దారికన్నా ఇతోధికంగా సరయిన దారిని నేను మీకు చూపెట్టినా మీరు అదే బాటన సాగుతూ ఉంటారా అని. దానికి వారు దైవసందేశహరులందరికీ ఇదే సమాధానం ఇచ్చారు, ఏ ధర్మం వైపునకు పిలుపునివ్వడానికి నీవు పంపబడ్డావో, మేము దాని తిరస్కారులము. చివరికి వారి సంగతేమో మేమే చూసుకున్నాము, చూసుకోండి తిరస్కరించే వారి అంతిమ పరిణామం ఏమయిందో.

26 – 28 ఆ సందర్భాన్ని గుర్తుకు తెచ్చుకోండి, అప్పుడు ఇబ్రాహీమ్ తన తండ్రినీ, తన జాతినీ సంబోధించి ఇలా అన్నాడు,[24] "మీరు ఆరాధించేవాటితో నాకు ఎటువంటి సంబంధమూ లేదు. నన్ను సృష్టించిన వానితోనే నా సంబంధం. ఆయనే నాకు మార్గనిర్దేశన చేస్తాడు."[25] ఇబ్రాహీమ్ ఇదే వచనాన్ని తన తరువాత తన సంతానంలో వదలిపెట్టి వెళ్ళాడు, వారు దాని వైపునకు మరలడానికి. (ఇంతజేసీ ఈ జనులు ఇతరుల దాస్యమే చేయసాగినప్పుడు నేను వారిని తుడిచివేయలేదు)

23. ఈ విషయం గమనార్హమయినది. ప్రవక్తలకు ప్రతిగా తాత ముత్తాతల అనుసరణ పతాకను లేవనెత్తిన వారు ప్రతి కాలంలోనూ జాతిలోని స్థితిపరులయినవారే ఎందుకు ముందుకు వచ్చారు? సత్యాన్ని వ్యతిరేకించడంలో వారే ముమ్మందు ఉంటూ నెలకొన్న అజ్ఞానాన్ని నిలబెట్టడానికి జరిగే ప్రయత్నంలో క్రియాశీలురయి ఉండటానికి కారణం ఏమిటీ, వారే జనుల్ని పెడద్రోవ పట్టించి, ప్రవక్తల కెదురుగా కలతలు రేపేందుకు ప్రజల్ని ఉసి గొలుపుతున్నా రెందుకు? దీనికి మౌలికమయిన కారణాలు రెండు. ఒకటి, స్థితి పరులు, సంపన్నులయినవారు తమ ప్రపంచ నిర్మాణంలోనూ దానిద్వారా సుఖాస్వాదనలోనూ నిండా మునిగి తేలుతుంటారు. సత్యాసత్యాలు వంటి విషయాలలో నేడు 'పనికి రాని' వాదనల్లో తలదూర్చడానికి సిద్ధంగా ఉండరు. వారి అలసత్వం, సుఖాభిలాష, బౌద్ధిక మాంద్యం వారిని ధర్మం విషయంలో అత్యంత బలహీను లుగా దానితో పాటు ఆచరణాత్మకంగా అత్యంత యధాతథ వాదులు (Conservatives) గా రూపొందిస్తుంది. తద్వారా ముందు నుంచి వస్తున్న స్థితులే, అవి సత్యాలా అసత్యాలా అన్న ప్రశ్న అలా ఉంచి, యధాతథంగా స్థిరంగా ఉండాలన్నది, మరో కొత్త వ్యవస్థను గురించి ఆలోచించే శ్రమ కలగకుండా ఉండాలన్నది వారి అభిమతం. రెండవది, ఉన్న వ్యవస్థతో వారి ప్రయోజనాలు పూర్తిగా ముడిపడి ఉంటాయి. ప్రవక్తలు ప్రతిపాదించే వ్యవస్థను చూసి వారు తొలిచూపులోనే పసిగడతారు, అది వస్తే తమ పెత్తందారీతనం పూర్తిగా తల్లక్రిందులయి పోతుందని. అధర్మ సంపాదనకు, అధర్మ ఆచరణకు ఎటువంటి స్వేచ్ఛ వారికి మిగుల దని. (మరిన్ని వివరాలకు చూడండి ఖుర్ఆన్ అవగాహనం, సం.2, అల్ అన్ఆమ్: పాదసూచి 91; సం.3, అల్ ఆరాఫ్: ఆయత్‌లు 59–74, 88–126; హూద్: ఆయత్ 25–34; బనీ ఇస్రాయీల్: ఆయత్ 16,17; అల్ మూ'మినూన్: ఆయత్‌లు 23–25, పాదసూచికలు 35, 59; సం.6, సబా:34, పాదసూచి 54).

24. వివరాలకు చూడండి ఖుర్ఆన్ అవగాహనం, సం.1, అల్ బకర: పాదసూచికలు 124 – 133; సం.2, అల్ అన్ ఆమ్: పాద సూచికలు 50 – 55; సం.4, ఇబ్రాహీమ్ : పాద సూచికలు 46 – 53; మర్యమ్ : పాదసూచికలు 26, 27; అల్ అన్బియా: పాద సూచికలు 54–66; సం.5, అష్ షు'అరా: పాదసూచికలు 50– 66; సం.6, అల్ అన్కబూత్ : పాద సూచికలు 26–46; సం.7 అస్ సాప్ఫాత్: 83–100; పాదసూచికలు 44 – 55).

25. ఈ పదాలలో మహనీయ ఇబ్రాహీమ్ కేవలం తన విశ్వాసాన్నే ప్రకటించలేదు, దానికి ఆధారాన్ని కూడా చూపారు. ఇతర ఆరాధ్యులతో సంబంధం లేకపోవడానికి కారణం ఏమిటంటే, వారు పుట్టించనూలేదు, ఏ వ్యవహారంలోనూ అవి సరయిన దారి చూపనూ లేవు, చూపజాలవు కూడా. కేవలం ఒకే ఒక్క డయిన అల్లాహ్‌తో సంబంధం ఏర్పరచుకొనడానికి కారణం, ఆయనే సృష్టించేవాడు, ఆయనే మానవునికి సన్మార్గం చూపేవాడు, చూపగలవాడూ కావడం.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం

## అధ్యాయం : 62
## మహనీయ అబూబక్ర్(రజి) ఇస్లాం స్వీకరించిన సంఘటన[1]

**486)** హ్రజత్ అమ్మార్ బిన్ యాసిర్(రజి) ఇలా అన్నారు: నేను (మొదట్లో) దైవప్రవక్త(స)ను చూసినప్పుడు, ఆయన వెంట ఐదుగురు బానిసలు[1], ఇద్దరు స్త్రీలు[2] అబూబక్ర్ సిద్దీఖ్(రజి)[3] తప్ప మరెవరూ (ముస్లింలు)లేరు.

## అధ్యాయం : 63
## మహనీయ సాద్ బిన్ అబీ వఖ్ఖాస్(రజి)[1] ఇస్లామ్ స్వీకరణా వృత్తాంతం

**487)** అబూ ఇస్‌హాఖ్ సాద్ బిన్ అబీ వఖ్ఖాస్(రజి) చెప్పగా తాను విన్నానని సయీద్ బిన్ ముసయ్యిబ్ తెలిపారు: నేను ఇస్లామ్ స్వీకరించిన రోజే ఇతరులు కూడా ఇస్లామ్ స్వీకరించారు. నేను ముస్లిమ్‌గా ధర్మపరివర్తన చెంది ఏడు రోజులు గడిచేవరకూ నేను మొత్తం ముస్లిములలో మూడోవంతుగా ఉండేవాణ్ణి."[1]

62-1. ఈయన అసలు పేరు అబ్దుల్లాహ్. ఉస్మాన్ అబూ ఖుహాఫా కుమారుడు. ఏడు తరాలు వెనక్కిపోతే ఈయన వంశ వృక్షం దైవ ప్రవక్త(స) వంశంతో కలుస్తుంది. అతీఖ్‌గా కూడా పిలువబడేవారు. ఈయన నరకాగ్ని నుండి పూర్తిగా విముక్తి నొందిన వారని దైవప్రవక్త (స) సెలవిచ్చారు. ప్రతి యుద్ధంలో, ప్రతి ముఖ్యమైన సందర్భంలో దైవప్రవక్త వెంట ఉండేవారు. వృద్ధాప్యంలో గడ్డానికి, తల వెంట్రుకలకు గోరింటాకు తైలం పూసుకునేవారు.

486-1. బిలాల్, జైద్, ఆమిర్, అబూ ఫకీహ, ఉబైద్‌లు.

486-2. ఆ ఇద్దరు స్త్రీలు హ్రజత్ ఖదీజా(ర.అ), హ్రజత్ ఉమ్మె ఐమన్ (ర.అ), లేదా సుమయ్యా(ర.అ).

486-3. మహనీయ అబూబక్ర్ సిద్దీఖ్(రజి) ఏనుగుల వాళ్ళ సంఘటనకు రెండేళ్ళ క్రితం మక్కాలో జన్మించారు. హిజ్రీ 13వ సంవత్సరంలో మరణించారు. 28 నెలలపాటు ప్రథమ ఖలీఫాగా పరిపాలన చేశారు. ఈయన్ని 'సిద్దీఖ్' (మహా సత్యవంతుడు) అని అనడానికి ప్రధాన కారణం; ఈయన అజ్ఞాన కాలంలో ఎన్నడూ అబద్ధం చెప్పలేదు. విగ్రహారాధన చెయ్యలేదు.

ఖాజీ అబుల్ హుసైన్ తన సనదుననుసరించి చేసిన ఉల్లేఖనం ప్రకారం, ఈయన తండ్రి అబూ ఖుహాఫా ఒకరోజు ఈయన్ని విగ్రహాలయంలోనికి తీసుకెళ్ళారు. విగ్రహం ముందు ప్రణమిల్లమని పురమాయించారు. అలా చెప్పి వెళ్ళి పోయారు తండ్రి.

అబూబక్ర్ ఇలా అంటున్నారు: నేను ఒక విగ్రహం దగ్గరకు వెళ్ళి, 'నాకు ఆకలిగా ఉంది. అన్నం పెట్టు' అని అడిగాను. ఆ విగ్రహం నుండి సమాధానం రాలేదు. 'నాకు బట్టలు లేవు. బట్టలు ఇవ్వు' అని కోరాను. ఇప్పుడు కూడా ఆ విగ్రహం నుండి జవాబు రాలేదు. చివరకు నేను ఒక రాయి తీసుకుని, 'ఒకవేళ నీవే గనక దేవుడవైతే నా బారి నుండి నిన్ను రక్షించుకో' అంటూ దానిపై రాయి రువ్వి అక్కడే పడుకున్నాను. అంతలో నాన్నగారు వచ్చి, 'అబ్బాయి! ఏం చేస్తున్నావ్?' అని అడిగారు. 'మీరు చూస్తున్నదే' అని బదులిచ్చాను. ఆయన గారు నన్ను మా అమ్మ దగ్గరకు తీసుకెళ్ళి, జరిగినదంతా చెప్పారు. దానికి ఆమె, 'నా పుత్ర రత్నానికి ఏమీ అనకు. ఇతని మూలంగా, ఇతను నా గర్భంలో ఉండగా అల్లాహ్ నాతో సంభాషించాడు. నాకు పురిటినొప్పులు వచ్చినప్పుడు నాకు వినిపించిన ఆకాశవాణి ఇది: "ఓ దైవదాసీ! సంతోషించు. నీకు ఒక స్వతంత్రుడైన పిల్లవాడు పుడతాడు. ఆకాశంలో అతని పేరు సిద్దీఖ్. అతను హ్రజత్ ముహమ్మద్(స) సహచరునిగా, మిత్రునిగా ఉంటాడు."

63-1. ఈయన గారి కునియత్ అబూ ఇస్‌హాఖ్. స్వర్గలోక శుభవార్తను అందుకున్న పది మంది సౌభాగ్యవంతుల (అష్రె ముబష్షిరా)లో ఒకరు. 17 ఏళ్ల వయసులో ఇస్లామ్ స్వీకరించారు. అన్ని ధర్మయుద్ధాలలో దైవప్రవక్త(స)తో కలసి పాల్గొన్నారు. విలువిద్యలో సాటిలేని మేటి. దైవప్రవక్త(స) ఈయన కొరకు ప్రత్యేకంగా దైవాన్ని ప్రార్థించారు. మదీనా నగరానికి కొంతదూరాన ఉన్న 'అతీఖ్' స్థానంలో పరమపదించారు. ప్రజలు ఆయన శవ పేటికను మదీనా వరకు మోసుకుని వచ్చారు. ఆనాటి మదీనా పురపాలకుడైన మర్వాన్ బిన్ హకమ్ జనాజా నమాజ్ చేయించారు. ఆయన మరణించిన సంవత్సరం హిజ్రీ 55.

487-1. ఈ హదీసు ఇంతకుముందు కూడా వచ్చింది. సాద్ బిన్ వఖ్ఖాస్(రజి) తన జ్ఞాన పరిధిలో ఇలా చెప్పి ఉంటారు. అన్యథా ఈయనకు ముందే మహనీయ అలీ(రజి), హ్రజత్ ఖదీజా(ర.అ), హ్రజత్ అబూ బక్ర్(రజి) తదితరులు ఇస్లామ్ స్వీకరించారు. బహుశా వీరంతా ఒకే రోజు ఇస్లామ్‌లో చేరారేమో! వారిలో చివరివారు సాద్ అయి ఉండవచ్చు.



# పవిత్ర మక్కా ప్రాశస్త్యం

**- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ**

**ఈ స్థలంలోనే అల్లాహ్ ఆరాధనకై ప్రజలందరి కోసం మొట్ట మొదటి అల్లాహ్ గృహం నిర్మించబడింది.**

మానవుల కోసం నిర్మించబడిన మొట్టమొదటి ఆరాధనాలయం మక్కాలో ఉన్నదే (కాబా). అది ఎంతో శుభప్రదమైనది, యావత్ మానవాళికి మార్గదర్శకమైనది. అందులో (కళ్ళున్న వారికి) అనేక సూచనలు ఉన్నాయి. ఆ సూచనల్లో ఇబ్రాహీం (ప్రార్థన కోసం నిలబడే) చోటొకటి. అందులో (అంటే కాబాలో) ప్రవేశించే ప్రతి వ్యక్తీ శాంతీ, రక్షణా పొందగలడు. అక్కడకు చేరుకోగలిగేవారు దాన్ని విధిగా సందర్శించాలి. (అంటే హజ్ చేయాలి.) ఇది ప్రజలపై దేవునికున్న హక్కు. ఈ ఆజ్ఞ శిరసావహించడానికి తిరస్కరించే వాడు అల్లాహ్ నిరపేక్షాపరుడని తెలుసుకోవాలి. (ఆల్-ఎ-ఇమ్రాన్: 96-97)

ప్రవక్త ఇబ్రాహీం (అ) ఇస్మాయీల్ (అ)లు తమ భుజాలపై ఈ ఇంటి రాళ్ళని మోసారు. దీనాతిదీనంగా అల్లాహ్‌ను వేడుకున్నారు.

ఇబ్రాహీం, ఇస్మాయీల్ ఇద్దరూ దైవగృహానికి పునాదులు తీసి గోడలు నిర్మిస్తూ ఇలా వేడుకున్నారు:

**"ప్రభూ! మా ఈ సేవ స్వీకరించు. నీవే (అందరి మొరలు) ఆలకించేవాడవు, సర్వం తెలిసినవాడవు. ప్రభూ! మాఇద్దర్నీ నీకు విధేయులైన దాసులుగా చెయ్యి. మా సంతతి నుండి నీకు విధేయులైవుండే ఒక జాతిని ఆవిర్భవింపజేయి. నిన్ను ఆరాధించే పద్ధతేమిటో మాకు తెలియజేయి. మా పొరపాట్లు మన్నించు. నిస్సందేహంగా నీవు మన్నించేవాడవు, కరుణించే వాడవు. ప్రభూ! ఆ జాతి ప్రజలకు నీ వాక్యాలను విన్పించే, నీ గ్రంథ జ్ఞానాన్ని, వివేకాన్ని నేర్పి వారి జీవితాలను సంస్కరించే ఒక ప్రవక్తను స్వయంగా వారిలోనుండే పుట్టించు. నీవు ఎంతో శక్తిమంతుడవు, వివేకవంతుడవు." (అల్-బఖరహ్: 127-129)**

**ఇబ్రాహీం దేవుడ్ని ప్రార్థిస్తూ "ప్రభూ! ఈ పట్టణాన్ని శాంతినగరంగా చెయ్యి. ఇక్కడ నివసించే ప్రజల్లో దైవాన్ని, పరలోకాన్ని విశ్వసించే వారికి తినేందుకు అన్ని విధాల పండ్లు ఫలాలు ప్రసాదించు" అని అన్నారు. (అల్-బఖరహ్: 126)**

ఈ ప్రదేశంలోనే దుష్టుడు అబ్రహ, అతని సైన్యం నాశనం చెయ్యబడింది.

**నీ ప్రభువు ఏనుగుల వాళ్ళను ఏం చేశాడో నీకు తెలియదా? ఆయన వారి (దుష్ట) యత్నాలను వమ్ము చేయలేదా? వారి**

**మీదికి ఆయన పక్షుల్ని గుంపులు గుంపులుగా పంపాడు. అవి వారి మీద కంకర్రాళ్ళు విసరి పడేశాయి. దాంతో వారు పశువులు తిని తొక్కివేసిన చెత్తలా (సర్వనాశనం) అయ్యారు.**
**(అల్-ఫీల్: 1-5)**

➢ ఈ స్థలంలోనే చరిత్రలో అతి పెద్ద సంఘటన జరిగింది. ప్రవక్త ముహమ్మద్(స)పై వహీ ద్వారా దైవధర్మం పరిపూర్ణం చెయ్యబడింది.

➢ **నేనీ రోజు మీకోసం మీ ధర్మాన్ని (సమగ్ర జీవన వ్యవస్థగా) పరిపూర్ణం చేశాను. మీ పైన నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను. మీ శ్రేయస్సు కోసం ఇస్లాంను మీ జీవనధర్మంగా ఆమోదించాను.**
**(అల్-మాయిదహ్: 03)**

➢ ఈ స్థలం నుంచే ప్రవక్త(స) వారిని గగన యాత్రకి తీసుకెళ్ళడం జరిగింది. ఆకాశ వాసులు- భూవాసులతో, దూతలు- మానవులతో ఆయన(స) కలిసారు.

**అల్లాహ్ ఎంతో పరిశుద్ధుడు. ఆయన తన నిదర్శనాలు చూపడానికి ఒకరోజు రాత్రి వేళ తన దాసుణ్ణి మస్జిద్ హరామ్ నుండి దూరాన ఉన్న (అఖ్సా) మసీదు దగ్గరకు తీసికెళ్ళాడు. ఆ మసీదు పరిసరాలను ఆయన శుభవంతం చేశాడు. నిశ్చయంగా ఆయన సమస్తం వింటున్నాడు. ప్రత్యక్షంగా ప్రతిదాన్నీ చూస్తున్నాడు. (బనీ ఇస్రాయీల్: 01)**

కాబా గృహాన్ని 'బైతుల్ హరామ్' (పవిత్ర గృహం, గౌరవ మర్యాదల గృహం) అని అనడానికి ప్రధాన కారణం- దాని పరిధిలో వచ్చే ప్రాంతంలో వేటాడటం, చెట్లు నరకటం ఇత్యాధివి నిషేధించబడ్డాయి. ఆఖరికి కన్న తండ్రిని చంపిన దుర్మార్గుడు తారసపడినా ఆ పరిధిలో ప్రతీకారం తీర్చుకునేందుకు కూడా అనుమతించబడలేదు.అంతేకాక, ఈ ప్రాంత జనుల నివాసానికి, మనుగడకు యోగ్యమైన ప్రాంతంగా ఖరారు చేయబడింది అంటే, ఈ పవిత్ర గృహం మూలంగా మక్కా వాసుల జీవనం సుఖప్రద మవ్వటమే కాకుండా, ఆర్థికంగా అది వారికి బలం చేకూరుస్తుంది. అనగా, మక్కా ప్రజలకు లేదా సవూదీ ప్రజలకు లభించే ఈ స్వాగత సన్మానాలు, గౌరవాదరణలు కాబా గృహం కారణంగానే. ఈ కాబా గృహం వల్లనే మక్కాలోని జనులు సుఖశాంతులతో వర్ధిల్లుతున్నారు. ప్రపంచం మొత్తం అశాంతి అల జడులమయమై ఉన్నా అక్కడ మాత్రం శాంతి సుస్థిరతలున్నాయి.

ఇంతటి గౌరవం ఒక్క మక్కాకే ఎలా దక్కింది అంటే, దైవ ప్రవక్త (స) వారి ఈ హదీసు చదవాల్సిందే. "నిశ్చయంగా అల్లాహ్, ఈ పట్టణాన్ని భూమ్యాకాశాలను పుట్టించిన నాటి నుండే పవిత్రంగా చేశాడు. అది ప్రళయం వరకూ అల్లాహ్ అనుగ్రహించిన ఔన్నత్యంతో పవిత్రంగానే చూడబడుతోంది". (బుఖారీ, ముస్లిం)

నేడు మానవులు అనేక స్థలాలను, ప్రదేశాలను పవిత్రంగా చేసుకున్నారు. ఆ స్థలం, ఆ ప్రాంతం ఏ సమాజానికి, మరే మతానికి సంబంధించినదైనా కావచ్చు. మక్కా అంతటి పవిత్రత, గౌరవం వాటిలో ఏ ఒక్క దానికీ లేదు అన్నది మాత్రం నిర్వివాదాంశం. ఎందుకంటే, మక్కాకు లభించిన పవిత్రత సనాతనం, నిత్య నూతనం, దైవ ప్రసాదితం. ఇతర ప్రాంతాల కు లభించినది మానవ కాల్పనికం, కృత్రిమం, క్షణికం. స్వయం మనిషే తన స్వహస్తాలతో వాటిని కుప్పకూలుస్తాడు. అయితే మక్కా, మక్కాలోని కాబా అటువంటిది కాదు. దీనికి సుదీర్ఘమైన మానవ చరిత్రే ప్రత్యక్ష సాక్షి!

➢ ఈ స్థలంలోనే జమ్‌జమ్ జలం పెల్లుబికింది. శతాబ్దాల తరబడి ప్రపంచమంతటికీ అది సరఫరా అవుతోంది.

హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) తన జ్యేష్ఠపుత్రుడైన బాల ఇస్మాయీల్‌ను, సతీమణి అయిన హజ్రత్ హాజిరా (అలైహస్సలాం)ను కాబా ఎగువ భాగాన వదలివెళ్ళిన తర్వాత ఉన్న ఆ కాసిన్ని ఖర్జూరాలు, నీళ్ళు అయిపోయాయి. ఏ ప్రాణీ నివసించని ఆ రాతి నేలలో తీవ్రమయిన దాహంతో నాలుక పీక్కుపోయింది. చివరికి పసికందుని తాపించేందుకు చనుబాలు కూడా ఇంకిపోయాయి. ఏం చేయాలో, ఎలా దాహం తీర్చుకోవాలో, ఏ విధంగా బాలుడ్ని రక్షించుకోవాలో తోచని అయోమయ స్థితిలో పడివున్నారు హజ్రత్ హాజిరా (అలైహస్సలాం). అయినా తాను నిరాశ చెందలేదు. నిస్పృహకు లోనవ్వలేదు. తమ వంతు కృషి ప్రారంభించారు. ఒకసారి సఫా కొండపైకి ఎక్కి చూస్తే, మరోసారి మర్వా




కొండపైకెక్కి 'నీళ్ళు లభించే మార్గం దొరక్కపోతుందా!' అని ఎదురు చూపులు చూస్తున్నారు. ఇలా సఫా నుండి మర్వా వరకు, మర్వా నుండి సఫా వరకు ఏడు సార్లు దౌడు తీశారు హజ్రత్ హాజిరా (అలైహస్సలాం). చివరికి మర్వా కొండపై ఉండగా ఏదో అలికిడి...! ఏమైవుంటుందా..!! అని బాల ఇస్మాయీల్ వద్దకు చేరుకున్నారు. పసికందు మండుటెండల్లో భరించలేని ఆకలితో అల్లాడిపోతున్నాడు పాపం! అప్పుడే దైవ దూత ప్రత్యక్షమై తన రెక్కలతో నేలలో రాజేయగా చుక్క నీరు కూడా లభ్యం కాని ఆ నల్లరాతి నేల నుండి జలనిధి పెల్లుబికింది. హజ్రత్ హాజిరా (అలైహస్సలాం) గారు ముందు బాల ఇస్మాయీల్ దాహాన్ని తీర్చి తర్వాత తానూ దాహం తీర్చుకున్నారు. తన అన్వేషణ ఫలించి నందుకు, తన శ్రమకు మించిన వరాన్ని దేవుడు అనుగ్రహించి నందుకు దైవానికి మనసారా కృతజ్ఞతాభివందనలు తెలుపుకు న్నారు. పారే ఆ జలనిధిని చూసి, ఇది ఇలానే పారుతూ ఉంటే అతి తొందరగా అంతమైపోతుందని భావించి, దాని చుట్టూ మట్టితో గట్టు వేస్తూ ఈ జలనిధిని ఎలాగైనా కాపాడుకోవాలన్న తీవ్ర తపనతో ఆమె నోట అప్రయత్నంగా వెలువడిన అమృత వాక్కు 'జమ్ జమ్' (అంటే అప్పటి భాషలో 'ఆగిపో, ఆగిపో' అని అర్థం). ఆ చిన్నపాటి గట్టులో ఆ మహత్తర జలనిధిని ఆపే శక్తి లేకపోయినా ఆమె నోట అపూర్వ విశ్వాసంతో వెలువడిన పలుకు మహిమతో ఆ జలం జలనిధిగా ఓ చోట నిలిచిపోయింది. అదే జమ్ జమ్ బావిగా ప్రసిద్ధి చెందింది.

ఓ సందర్భాన దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "అల్లాహ్ ఇస్మాయీల్ తల్లిని కరుణించుగాక! ఆమె గనక ఈ జలనిధికి గట్టువేసి ఆపి వుండకపోతే ప్రళయం వరకూ జమ్‌జమ్ జలం పారే సెలయే రయ్యేది."

## జమ్ జమ్ జల నిధి

జమ్ జమ్ బావి స్వర్గపు సెలయేర్లలోని ఓ సెలయేరు. ప్రవక్త ఇబ్రాహీమ్ (అలైహి) మక్కా కోసం చేసిన దుఆ తర్వాత దేవుడు అనుగ్రహించి ప్రసాదించిన తొలి బహుమతి ఈ జలం. మక్కా అంతటి పవిత్ర నగరం ఉనికిలోకి రావడానికి, జన వాహినితో, దైవదాసుల రాకపోకలతో అలరారడానికి కారణమయ్యింది ఈ మహత్తర జలనిధే. కొన్ని వేల సంవత్సరాలుగా లభ్యమవుతున్న దేవుని ఏకైక మహిమ ఈ జలం. ఇహలోకంలో దైవ సూచనల్లోని ఓ సూచన ఈ జలం. ఇక్కడికి వచ్చే ప్రతీ యాత్రికుడు, ప్రతీ బాటసారి తనివితీరా సేవించే అద్భుత ద్రవం ఈ జలం. ఇంతటి మధురమైన నీరు లోకంలో మరో చోట లేదు. ఈ నీటిలో గొప్ప శుభం ఉంది. అది త్రాగే ప్రతీ వారికి ఆరోగ్యం ప్రాప్తమవుతుంది. పరిశుద్ధాత్మ అయిన దైవ దూత జిబ్రయీల్(అ) ద్వారా ఉనికిలోకి వచ్చిన అనంత జల సంపద ఈ జమ్‌జమ్. ప్రియ ప్రవక్త(స) వారి హృదయం పలుమార్లు ఈ పవిత్ర జలంతో కడగబడింది. ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) కాలం నుండి అంతిమ ప్రవక్త ముహమ్మద్(స) వరకు వచ్చిన ప్రవక్తలందరూ త్రాగాలని తహతహలాడిన జలం జమ్ జమ్. ఏ జలానికీ లేని ఈ జలానికి గల ప్రత్యేకత ఏమిటంటే-, ఇది ఆకలిగొన్న వ్యక్తి ఆకలిని తీరుస్తుంది. రోగాన్ని నయం చేస్తుంది. తలనొప్పి, కడుపు నొప్పికి ఇది దివ్య ఔషధం. ఈ జలం వల్ల కంటి చూపు మెరుగవుతుంది. అందుకే ప్రవక్తశ్రీ (స) ఇలా ప్రవచించారు: "మావు జమ్ జమ్ లిమా షురిబ లహు" (ఏ సదుద్దేశంతో జమ్ జమ్ త్రాగుతారో వారి ఆ ఉద్దేశం సిద్ధిస్తుంది.) ఈ జలాన్ని కడుపు నిండా త్రాగటం విశ్వాసానికి చిహ్నం. కాపట్యానికి విరుగుడు. ఇది పుణ్యాత్ముల కోసం మహోన్నత పానీయం.

బంధు మిత్రుల కోసం గొప్ప బహుమానం. అతిథుల ఆతిథ్యం కోసం అద్వితీయ ద్రవ పదార్థం. శరీరానికి శక్తినీ, హాయినీ ఇచ్చే అద్భుత వరప్రసాదం. ఎంత వాడినా అది తరగదు. దాదాపు నాలుగు వేల సంవత్సరాల నుండి ఈ జలం ఇలానే నిర్విరామంగా పెల్లుబుకుతూనే వుంది. ప్రస్తుతం యావత్ప్రపంచంలో అతి ప్రాచీనమైన బావి ఇదేనన్న నానుడీ ఉంది.

➢ ఈ స్థలంలోనే సత్యప్రియుడు, సత్యసంధుడు, సద్గుణ సంపన్నుడు, శుభకరుడు, సర్వలోక కారుణ్యమూర్తి అయిన అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) జన్మించారు.

➢ ఈ మహిమాన్విత స్థలంలోనే అంతిమ దైవ మహిమాన్విత గ్రంథం ఖుర్ఆన్, మహిమాన్విత మాసం, మహిమాన్విత రాత్రిలో అవతరణ జరిగింది.

> **మేము దీన్ని ఘనతగల మహారాత్రిన అవతరింపజేశాం. ఘనతగల ఆ రాత్రి ఏమిటో నీకేంతెలుసు? ఆ మహారాత్రి వేయి నెలల కన్నా శ్రేష్ఠమైనది. ఆరాత్రి పరిశుద్ధాత్మ, దైవ దూతలు తమ ప్రభువు అనుమతితో ప్రతి వ్యవహారానికి సంబం ధించిన ఆజ్ఞలు తీసుకొని అవతరిస్తారు. అది ఉషోదయం దాకా పూర్తిగా శుభవంతమైన రాత్రి. (అల్-ఖద్ర్: 1-5)**

➢ ఈ స్థలంలోనే విశ్వాసులకు అతి పెద్ద విజయం లభించింది. చిల్లర దైవాలుగా పూజింపబడే శిలలను పగలగొట్టడం జరిగింది.

అసత్యంపై సత్యం విజయ కేతనాన్ని ఎగుర వేసింది. హజ్రత్ బిలాల్ (ర) లాంటి నల్లని నిగ్రో కాబా గృహంపైకెక్కి అజాన్ ఇచ్చారు.

**(ప్రవక్తా!) అల్లాహ్ సహాయం వచ్చి, విజయం లభించిన తరువాత ప్రజలు తండోపతండాలుగా అల్లాహ్ ధర్మంలో చేరుతూ ఉండటం నీవు గమనిస్తూనే ఉన్నావు. కనుక నీ ప్రభువు ఔన్నత్యం స్తుతిస్తూ, ఆయన పవిత్రతను ప్రశంసిస్తూ ఉండు. దాంతోపాటు ఆయన సన్నిధిలో నీ పొరపాట్లకు క్షమాపణకై వేడుకో. ఆయన గొప్పక్షమాశీలి. (అన్-నస్ర్: 1-3)**

## మక్కా మర్యాద

ఈ నగరం శాంతి నిలయం, మార్గదర్శక కేంద్రం. ఇందులో ప్రవేశించక ముందు స్నానం చెయ్యటం ప్రవక్త (స) సదాచారం. ఈ నగరంలో మంచి కార్యాల ప్రతిఫలం చాలా ఎక్కువ. అలాగే పాపాల శిక్ష కూడా చాలా కఠినమైనదే. కనుక ఇక్కడ ఉన్నన్ని రోజులు పుణ్యకార్యాలే చెయ్యాలి. పాపాలకి ఒడిగట్టకూడదు. ఈ నగరాన్ని హరమ్ అని కూడా అంటారు. కనుక హరమ్ సరిహద్దుల్లో ఇహ్రాం ధరించినవారైనా, ధరించనివారైనా వేటాడటం నిషిద్ధం. ఒకవేళ వేటాడి జిబహ్ చేసినా అది హలాల్ అవ్వదు. హరమ్ పరిసరాల్లో గల చెట్లను, గడ్డిని అనవసరంగా పెరక కూడదు. క్రింద పడి ఉన్న వస్తువుని మంచి ఉద్దేశ్యంతో తప్ప ముట్టుకోకూడదు.

## అంతిమ హజ్జ్ ప్రసంగం

ఆయన (సల్లం), "ఇది ఏ మాసం?" అని అడిగారు. మేము జవాబుగా, "అల్లాహ్, ఆయన ప్రవక్త (సల్లం)కే బాగా తెలుసు" అన్నాము.

ఇది విన్న మహాప్రవక్త (స) కొంచెంసేపు మౌనం పాటించారు. మేము, ఈ నెలకు ఆయన మరేదైనా పేరు పెట్టనున్నారేమో అని అనుకున్నాం. కాని ఆ తరువాత ఆయన తిరిగి, "ఇది జిల్‌హజ్జా మాసం కాదా?" అని అడిగారు. "అవును, ఎందుకు కాదు" అన్నాం మేము.

ఆయన (సల్లం) మళ్ళీ, "ఇది ఏ నగరం?" అని ప్రశ్నించారు. మేము, "అల్లాహ్‌కు, ఆయన ప్రవక్త (స)కు బాగా తెలుసు." అని సమాధానమివ్వగా, ఆయన మళ్ళీ మౌనం వహించారు. మేము, ఆ మౌనాన్ని చూసి ఈ నగరానికి మరో పేరేదైనా పెడతారేమో అని అనుకుంటూ ఉండగా, తమ మౌనాన్ని వీడి, "ఇది బల్దాహ్ (మక్కా) కాదా?" అని ప్రశ్నించారు. "ఔను. తప్పకుండా" అని సమాధానమిచ్చాం మేము.

"సరే, ఈ రోజు ఏ రోజు?" అని అడిగారు ఆయన (సల్లం). "అల్లాహ్‌కు, ఆయన ప్రవక్త (స)కే బాగా తెలుసు" అన్నాము మేము. మా సమాధానం విన్న ఆయన (సల్లం) తిరిగి మౌనం వహించారు. మౌనాన్ని చూసి, ఈ రోజుకు మరో పేరేదైనా పెడతారేమో అని అనుకుంటూ ఉండగానే ఆయన (సల్లం), "ఈ రోజు యౌమున్నహ్ర్ (ఖుర్బానీ రోజు అంటే జిల్ హజ్జా పదవ తారీకు) కాదా?" అని అడిగారు. "ఔను, ఎందుకు కాదు" అని అన్నాము మేము. అప్పుడాయన ఇలా సెలవిచ్చారు:

"సరే వినండి, మీ ఈ నగరం, మీ ఈ నెల, మీ ఈ రోజు ఎలా నిషిద్ధం (హరాం) గావించబడిందో, అలానే మీ రక్తం, మీ సంపద, మీ మానం పరస్పరం ఒకరిపై ఒకరికి నిషిద్ధం గావించబడ్డాయి.

మీరు అతి త్వరలోనే మీ ప్రభువును చేరుకుంటారు. ఆయన మిమ్మల్ని మీ కర్మలను గురించి అడుగుతాడు. కాబట్టి చూడండి! నా తరువాత ఒకరి మెడలను మరొకరు నరుక్కునేలా ధర్మభ్రష్టులు కాకండి. నేను దైవసందేశాన్ని మీకు అందించి నా విధ్యుక్త ధర్మాన్ని నెరవేర్చుకున్నానా? చెప్పండి" అని అడిగారు. సహాబాలందరూ ముక్త కంఠంతో "అవును" అని పలికారు.

అప్పుడు ఆయన (స), "ఓ అల్లాహ్! నీవే సాక్షి!" అంటూ, "ఎవరైతే ఇక్కడ హాజరుగా ఉన్నారో (ఈ మాటలను) హాజరుగా లేనివారికి అందించాలి. ఎందుకంటే, ఎవరికైతే (ఈ మాటలు) అందించడం జరుగుతుందో వారు ప్రస్తుతం కొందరు (హాజరై) వినేవారి కంటే నా ఈ మాటల పరమార్థాన్ని బాగా తెలుసుకోగలరు" అని ఉద్బోధించారు.

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# నాకు బాగా తెలిసిన మరో ఉమరీ



జామియా దారుస్సలామ్, ఉమరాబాద్ విద్యా పీఠానికి నాలుగున్నర దశాబ్దాలు సెక్రెటరీగా విశేష సేవలందించిన మౌలానా కాకా సయీద్ అహ్మద్ ఉమరీ మరణం ఆ విద్యాపీఠానికే కాదు, ఉమ్మత్‌కు సయితం తీరని లోటు. కాకా సయీద్ అహ్మద్ ఉమరీతో నాకు అంతగా చనువు లేదు. ఆయన వ్యక్తిత్వం గురించి, ధార్మిక సేవలను గురించి ఉమరీ విద్వాంసులే వ్రాయగలరు. అందుకే మౌలానా అబ్దుల్ ఖాదిర్ ఉమరీ (కదిరి) గారిని అభ్యర్థించాను, వ్రాయమని. ఆయన వాగ్దానం చేశారు కూడా. ఆయన నుండి వ్యాసం రాకముందే మరో ఉమరీ పండుటాకు రాలిపోయింది. ఆయన పేరు **సనావుల్లాహ్ ఉమరీ.**

"సనావుల్లాహ్ ఉమరీ అంటే ఏ సనావుల్లాహ్ ఉమరీ?" అని చాలామంది సందేహం వెలిబుచ్చుతారు. ఎందుకంటే సనావుల్లాహ్ ఉమరీ పేరు గల విద్వాంసులు డజన్ల సంఖ్యలో ఉన్నారు. వారంతా భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందినవారు. అందుకే చాలామంది ఆ పేరు ప్రస్తావనకు రాగానే కన్‌ఫ్యూజ్ అవుతుంటారు. బహుశా ఈ కారణంగానేనేమో కట్టవాని చెరువు వాస్తవ్యులు, మఛిలీపట్నం హిందూ కాలేజీ విశ్రాంత ఆంగ్ల ఉపన్యాసకులైన మౌలానా సనావుల్లాహ్ ఉమరీ గారు తన పేరును "సనావుల్లాహ్ ఉమరీ, ఎం.ఏ" అని వ్రాసుకుంటారు.

23-5-2024వ తేదీ గురువారం నాడు ఉదయం పరలోక ప్రస్థానం చేసిన మౌలానా సనావుల్లాహ్ ఉమరీ కృష్ణా జిల్లా పెడన వాస్తవ్యులు. ఆయన తండ్రి మౌల్వీ అబ్దుల్ గఫార్ గారు భారత స్వాతంత్ర్య సమర కాలంలో పెడనలో ప్రఖ్యాత పండితునిగా, హిందూ ముస్లింల మధ్యన సమరసతా వారధిగా పేరుగాంచారు. బాల్యంలోనే పితృవియోగం కలిగిన సనావుల్లాహ్ ఉమరీ గారు జామియా దారుస్సలామ్, ఉమరాబాద్‌లో 9 ఏండ్లపాటు ఆలిమియత్ కోర్సు చేసి, ఆ తరువాత మద్రాసు యూనివర్సిటీ నుండి అదీబ్ ఫాజిల్ డిగ్రీ పొందారు.

విజయవాడలోని 'దర్స్‌గాహె ఇస్లామీ' విద్యాసంస్థలో రెండేళ్ళపాటు ఉపాధ్యాయునిగా పని చేశారు. దరిమిలా గవర్నమెంట్ ఉర్దూ టీచర్‌గా కృష్ణా జిల్లాలోని పామర్రు, నిభానుపూడి, వేమవరం, సుబ్బి చెరువు, కవుతవరం పాఠశాలల్లో సేవలందించి 2013లో రిటైర్ అయ్యారు.

మౌలానా సనావుల్లాహ్ ఉమరీ ఏ ఊరిలో టీచర్‌గా పనిచేసినా, కేవలం టీచర్‌గా మాత్రమే కాకుండా ఆ ఊరి మస్జిద్‌లో ఖతీబ్‌గా జుమా ప్రసంగాలు చేసేవారు. ఊరి ప్రజల 'అఖీదా'ను సంస్కరించేవారు. సంతోష సమయాల్లోనూ, కష్టకాలంలోనూ ఊరి ప్రజలకు మార్గదర్శనం చేసేవారు.

1990లో నా తమ్ముని (బాబు) నికాహ్ సందర్భంగా పెడనలో, ఆయన నన్ను దగ్గరకు పిలిచి నికాహ్ ప్రసంగం చేయమని కోరారు. "అయ్యో, విద్వాంసులు ఆసీనులై ఉన్న చోట నా లాంటి సామాన్యుడు ప్రసంగించటమా? వద్దు సార్. ఇది మీ హక్కు" అని సున్నితంగా తిరస్కరించాను. ఆరేళ్ళ క్రితం కైకలూరులో నా మేనల్లుడు (ఇద్రీస్) నికాహ్ సందర్భంగా కూడా ఆయన ప్రసంగించారు.

'నా నమాజె జనాజాకు మీరే సారథ్యం వహించాలి' అని మా నాన్న గారు కోరి ఉన్నారట. ఆ మాట ప్రకారం 2003లో సుబ్బిచెరువులో మా నాన్న గారు చనిపోయినప్పుడు, ఆయన వచ్చి జనాజా నమాజ్ చేయించారు. దాదాపు పాతికేళ్ళు పెడనలో మస్జిద్ ముతవల్లీగా ఉండి ఎంతో నిజాయితీగా- స్వచ్ఛందంగా- సేవలందించారు. మౌలానా సనావుల్లాహ్ ఉమరీ గారిది విద్వాంసుల కుటుంబం. ఆయన కుటుంబీకులలో మొత్తం ఏడుగురు ఉమరీ విద్వాంసులున్నారు. వారంతా నేల నాలుగు చెరగులా విస్తరించి ధార్మిక సేవలందిస్తున్నారు. నా మామయ్య కుమారుడగు సులైమాన్ (విజయనగరం) గారితో కూడా మౌలానాకు బంధుత్వ సంబంధం ఏర్పడింది. ఎప్పుడు పెడన వెళ్ళినా సనావుల్లాహ్ ఉమరీ గారి అబ్బాయి (ఇర్ఫానుల్లాహ్) భోజనానికి రమ్మని పిలుస్తుంటారు. కాని నాకు అంత తీరిక ఎక్కడ? ఒక్కసారి మాత్రం ఆయన ఆహ్వానాన్ని స్వీకరించి మౌలానా సనావుల్లాహ్‌తో కలసి విందారగించాను.

2014లో ఆయన హజ్జ్ చేశారు. ఆ సందర్భంగా నా ఆహ్వానాన్ని పురస్కరించుకుని, కుటుంబీకులందరితో కలసి మా ఇంటికి విచ్చేశారు. అది నాకు మరపురాని మధుర స్మృతి.

కారుణ్య ప్రభువు అల్లాహ్ దయతో ఆయన్ని మన్నించి, ఆయన సేవలను స్వీకరించి అనుగ్రహభరితమయిన స్వర్గ వనాలలో ఓలలాడేలా చేయాలని ప్రార్థన! (ఆమీన్)

**– అజీజుర్రహ్మాన్**

# సహనం సాహసానికి ప్రతిరూపం

**- ముహమ్మద్ వహీదుద్దీన్**

**సహనం** సాహసానికి ప్రతిరూపం. స్థిరత్వం సహనానికి దర్పణం. సహనం, సాహసం, స్థిరత్వాలు ఒకదానికొకటి అవినాభావ సంబంధాలు కలిగిన సుగుణాలు, విశ్వాసికి తప్పక ఉండవలసిన లక్షణాలు.

దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఈవిధంగా తెలిపారు : దేవుడే తమ ప్రభువని పలికి, ఆ మాటపైన్నే స్థిరంగా ఉండే వారికి (పర లోకంలో) ఎలాంటి భయం గాని, దుఃఖం గానీ ఉండదు. (అల్ అహ్‌ఖాఫ్- 46: 13)

విశ్వాసులారా! సహనం వహించి, ప్రార్థన చేస్తూ (మా) సహాయం అర్థిస్తూ ఉండండి. దేవుడు సహనం వహించేవారికే తోడుగా ఉంటాడు. (అల్ బఖర- 2: 153)

సహనం వహించే వారికి మేము వారి సత్కర్మలకు తప్పక శ్రేష్ఠమైన ప్రతిఫలం ప్రసాదిస్తాం. (అన్ నహ్ల్- 16: 96)

మీరు ప్రతీకారం తీర్చుకోదలచుకుంటే మీపై ఏ మేరకు దౌర్జన్యం జరిగిందో ఆ మేరకే ప్రతీకారం తీర్చుకోండి. కాని మీరు సహనం వహిస్తే మంచిది (అన్ నహ్ల్ 16: 126)

విశ్వాసులారా! సహనం పాటించండి. మిథ్యావాదుల ముందు ధైర్యసాహసాలు ప్రదర్శించండి. ధర్మసేవ కోసం నడుం బిగిం చండి. దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండండి. అప్పుడే మీరు (ఇహపరాల్లో) కృతార్థులవుతారని ఆశించగలరు.

(ఆలి ఇమ్రాన్ 3: 200)

దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా తెలిపారు : దేవుడు యాచించ కుండా ఉండటానికి ప్రయత్నించేవాడ్ని కాపాడుతాడు; నిరపేక్షా భావం అలవరచుకోవాలనుకున్న మనిషిని నిరపేక్షాపరునిగా చేస్తాడు, సహనం కోరే వ్యక్తికి సహనం వహించే సద్బుద్ధి ప్రసాదిస్తాడు. మనిషికి ఇవ్వబడిన కానుకల్లో సహనం కంటే శ్రేష్ఠమైన గొప్ప కానుక మరేదీ లేదు. (బుఖారీ, ముస్లిమ్)

విశ్వాసి వ్యవహారం చాలా వింతగా ఉంది. అతను చేసే ప్రతి పనిలో అతనికి మేలుంటుంది. విశ్వాసికి తప్ప మరెవరికీ ఈ భాగ్యం ప్రాప్తించలేదు. ఆనంద ఘడియల్లో అతను దైవానికి కృతజ్ఞతలు సమర్పించుకుంటాడు. ఈ కృతజ్ఞత వల్ల అతనికే మేలు కలుగుతుంది (పుణ్యం లభిస్తుంది). ఒకవేళ కష్టాలు వస్తే సహనం వహిస్తాడు. ఈ సహనం కూడా అతనికి మేలే కలగ జేస్తుంది. (ముస్లిమ్)

ఇబ్నె అబ్బాస్(రజి) కథనం : ఓ స్త్రీ దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి నాకు మూర్ఛ రోగముంది. దానివల్ల నా ఒంటిపై ఆచ్ఛాదనం తొలగిపోతోంది. నా కోసం దుఆ చేయండి అన్నది. దానికి దైవప్రవక్త(స) ''నువ్వు సహనం వహిస్తే నీకు స్వర్గం లభిస్తుంది లేదా నువ్వు కోరితే దేవుడు నీకు ఈ వ్యాధి నుండి ఉపశమనం కలిగించాలని నేను దుఆ చేస్తాను' అన్నారు. అందుకామె 'సరే ఓర్పు వహిస్తాను. కాని నా ఒంటిపై ఆచ్ఛాదన తొలగిపోతోంది. నేను నగ్నం కాకుండా ఉండాలని మాత్రం దైవాన్ని ప్రార్థించండి'' అని అన్నది. ఆ స్త్రీ కోరిక మేరకు దైవప్రవక్త(స) ఆమె కోసం దుఆ చేశారు. (బుఖారీ, ముస్లిమ్)

హజ్రత్ అనస్(రజి) కథనం : ఉమ్మె సులైమ్(రజి) ద్వారా అబూ తల్హా(రజి)కు పుట్టిన పిల్లవాడొకడు చనిపోయాడు. అప్పుడు ఉమ్మె సులైమ్ ఇంట్లో వాళ్ళకి బాబు చనిపోయాడన్న సంగతి అబూ తల్హా(రజి)కు చెప్పవద్దని తానే ఆయనకు తెలియజేస్తానని చెప్పారు. కొంతసేపటికి అబూతల్హా (రజి) ఇంటికి వచ్చారు. ఉమ్మె సులైమ్(రజి) ఆ రాత్రి ఆయనకు అన్నం వడ్డించారు.

... తర్వాత ఆమె తన భర్తను ''అబూ తల్హా! కొందరు ఓ కుటుంబానికి ఏదైనా వస్తువు తాత్కాలికంగా వాడుకోవడానికి ఇచ్చారనుకోండి, ఆ తరువాత వారు తమ వస్తువుని తిరిగిచ్చేయమని అడిగితే ఆ కుటుంబం ఇవ్వకుండా ఉండటం భావ్యమేనా?'' అని ప్రశ్నించారు.

దానికి అబూ తల్హా(రజి) "కాదు, అది సరైన పద్ధతి కాదని" అన్నారు. అప్పుడామె అయితే మీరు మన బాబు విషయంలో దైవం నుండి పుణ్యం ఆశించండి అన్నారు. అబూ తల్హా ఈ మాట విని 'నాకీ సంగతి ముందుగా ఎందుకు చెప్పలేదు?' అని రుసరుస లాడారు.

తరువాత ఆయన దైవప్రవక్త ముహమ్మద్(స) సన్నిధికి వెళ్ళి జరిగినదంతా వివరించారు. అది విని దైవప్రవక్త(స) 'మీరిద్దరు కలిసిన రాత్రిలో దేవుడు మీకు శుభం కలగజేయుగాక!' అని ప్రార్థించారు. ఆ తరువాత (కొంత కాలానికి) ఉమ్మె సులైమ్ (రజి) మళ్ళీ గర్భవతి అయ్యారు. (బుఖారీ, ముస్లిమ్)

- షరీఫా, విజయవాడ

# దైవ సామీప్యానికి ఖుర్బానీ



**ప్రపంచ వ్యాప్తంగా** ఉన్న ముస్లిములు వేల సంవత్సరాల నాటి మహనీయుడు 'ప్రవక్తల పితామహుని'గా ప్రసిద్ధిగాంచిన ఇబ్రాహీమ్ (అ) త్యాగనిరతిని స్మరించుకుంటూ 'ఈదుల్ అజ్‌హా' పండుగను జరుపుకుంటారు. ఈ పండుగనే 'బక్రీద్' అని కూడా అంటారు. ప్రతి పండుగ ఒక సందేశాన్ని మానవాళికి అందిస్తుంది. దైవానికి, దాసులకు మధ్య పండుగలు వారధిగా తోడ్పడతాయి. ప్రకృతిలోని నిదర్శనాల ద్వారా తన బుద్ధి, జ్ఞానం, తార్కిక విశ్లేషణ ద్వారా నిజ దైవాన్ని గుర్తించిన ఇబ్రాహీమ్ (అ) విధానం అనుపమానమైనది. ప్రతి విషయాన్ని గుడ్డిగా నమ్మక వివేకం, వివేచనతో శోధించాలని జ్ఞానమున్న ప్రతి ఒక్కరూ భావిస్తారు. కాని దైవం విషయం వచ్చేసరికి తాతముత్తాతల ఆచార వ్యవహారాలనే పాటించడం చేస్తూ ఉంటారు. ప్రవక్త ఇబ్రాహీమ్(అ) ఒక పూజారి కుటుంబంలో జన్మించినా, విగ్రహాల ఆరాధనే నిజ దైవ ఆరాధనగా భావించే తండ్రికి "మీరు చెక్కిన, మీరు తయారు చేసిన ఈ మట్టి విగ్రహాలను నేను ఆరాధించను" అని అత్యంత ధైర్యంగా, నిస్సంకోచంగా తెలిపారు. అంతేకాదు అత్యంత వినమ్రతతో, వివేకంతో 'నాన్న! మీ చేతులతో మీరే ఆకారం ఇచ్చిన విగ్రహాలను దైవంగా ఎలా ఆరాధిస్తార'ని ప్రశ్నించటం, సూర్యచంద్ర నక్షత్రాలు దైవాలు కావు, వాటిని సృష్టించిన వాడే నిజ దైవం అని అతన్ని మాత్రమే ఆరాధించాలని తండ్రి ఆజర్‌కి హితబోధ చేసిన తనయునిగా ప్రఖ్యాతిగాంచిన వారు ప్రవక్త ఇబ్రాహీమ్(అ). సృష్టించేవాడే కాని సృష్టించబడేవాడు కాడు, సంతానం ప్రసాదించేవాడే కాని, సంతానం కాని వాడు. సంతానం లేనివాడు, మరణాన్ని ఇచ్చేవాడే కాని, మరణం లేనివాడు, సజీవుడు, నిత్యుడు, అనంతుడు అయిన సృష్టికర్తను గుర్తించి ఆరాధించమనే బోధన చేసినవారు ఇబ్రాహీం ప్రవక్త. ఏ విషయాన్ని గుడ్డిగా, మూఢంగా, మూర్ఖంగా విశ్వసించక, విచక్షణా జ్ఞానంతో, వివేకంతో, విజ్ఞతతో ఆలోచించాలని వివరించిన ఇబ్రాహీమ్(అ) జీవితం నేడు మనందరికీ ఆదర్శం కావాలి.

తనయుని బోధనలకు ఆగ్రహించిన తండ్రి ఆజర్ ఆనాటి రాజు నమ్రూద్ ముందు రాజధిక్కార నేరంగా తన కుమారుడినే నేరస్తునిగా ప్రవేశపెట్టాడు. చక్రవర్తి ముందు కూడా ఎంతో నిబ్బరంతో ఆత్మ విశ్వాసంతో నా ప్రభువు సూర్యుణ్ని తూర్పున ఉదయింపజేసి, పడమర అస్తమింపచేస్తాడు. నీవు దానికి వ్యతిరేకంగా చేసిచూపించమని సవాలు విసిరారు ఇబ్రాహీం(అ). సమాధానం చెప్పలేని నమ్రూద్ ఆగ్రహంతో ఇబ్రాహీం(అ)ను భగభగమండే అగ్నిగుండంలో వెయ్యమనే ఆజ్ఞను ఇచ్చాడు. కాని అగ్నికి మండే శక్తిని, గాలికి వీచే గుణాన్ని, నీటికి ప్రవహించే శక్తిని ప్రసాదించిన సృష్టికర్త ఆ అగ్నిగుండాన్ని పూలవనంగా మార్చివేశాడు. ఇంతటి దృఢ విశ్వాసి అయిన ఇబ్రాహీమ్(అ) ముస్లిములకు మాత్రమే కాదు, యూదులు, క్రైస్తవులకు కూడా మూల పురుషుడు కావటం విశేషం. ఇబ్రాహీం(అ) కట్టుబట్టలతో ఆ అగ్నిగుండం నుండి బయటకు రావడం రాజు, ప్రజలు కళ్ళారా

చూసినారు. కాని కళ్ళు ఉన్నా దైవ నిదర్శనాలను చూడలేనివారు, మనసు ఉన్నా గ్రహించలేని వారికి దేవుడు ఎన్ని సంఘటనలు చూపినా కనువిప్పు కలగదు. ఇది సత్యం. నమ్రూద్, ప్రవక్త ఇబ్రాహీం(అ)ను దేశ బహిష్కరణగావించాడు. అచంచలమైన విశ్వాసం గల ఇబ్రాహీమ్(అ) కట్టుబట్టలతో దైవంపై భారం వేసి గమ్యమే తెలియని బాటపై నడవడం ప్రారంభించారు. ఏళ్ళ తరబడి దైవ సందేశాన్ని ప్రజలకు చేరవేశారు. తన ప్రాణాన్ని సైతం త్యాగం చెయ్యటానికి వెనుకాడని దృఢ విశ్వాసికి వృద్ధాప్యం వరకు సంతానం కలగలేదు. ధర్మసంస్థాపనా కార్యంలో తోడ్పడేందుకు సంతానం కావాలంటూ హజ్రత్ ఇబ్రాహీం(అ) దైవాన్ని ప్రార్థించారు. మొదటి భార్య సారా అనుమతితో రెండవ భార్యగా హజ్రత్ హాజిరా(అ)ను వివాహమాడారు. ఇబ్రాహీమ్ (అ)కు వృద్ధాప్యపు దశలో రెండవ భార్య హాజిరా (అ) ద్వారా ఇస్మాయిల్(అ) జన్మించారు. లేకలేక కలిగిన బిడ్డను చూసుకొని ఆ దంపతులు ఎంతగానో మురిసిపోయారు. ఆ సంతోషం ఎంతో కాలం నిలవలేదు. దైవం ఆయనకు మరో పరీక్ష పెట్టారు. భార్యను, కొడుకును జన సంచారం లేని ఎడారి ప్రాంతంలో వదిలేసి రమ్మని ఆదేశించాడు. దైవాదేశాన్ని తు.చ తప్పక పాటించారు. గుండె నిబ్బరం చేసుకుని, వణుకుతున్న పెదాలను అదుపులో పెట్టుకుంటూ బీబీ హాజిరా(అ)ను పిలిచి బాబు ఇస్మాయిల్‌ను తీసుకుని ప్రయాణం చెయ్యటానికి సిద్ధపడమని చెప్పారు. ఆనాటి భార్యలు భర్తల అడుగుజాడల్లో నడిచేవారు. వారికి తోడు నీడగా నిలిచారు. కాబట్టే భర్తలు సాఫల్యాలను సాధించేవారు. జీవనాధారమైన నీళ్ళను, ఖర్జూరపు పండ్ల మూటను తీసుకుని ఒంటెపై ప్రయాణించి ఎడారి ప్రాంతానికి చేరుకున్నారు. తనను ఒంటరిగా వదలి వెళ్ళిపోతున్న భర్తతో 'ఏమిటి? ఇది దైవాజ్ఞయా? అని ఆవేదనతో ప్రశ్నించారు హాజిరా(అ). భార్య అర్థం చేసుకున్నందుకు భర్త హృదయం సంతోషంతో పొంగి పోయింది. నేత్రాలు అశ్రువులతో నిండిపోయాయి. 'అవును' అనే గంభీర వచనాలు వెలువడ్డాయి. ఆ సమాధానంతో భార్య గుండె దైవ విశ్వాసంతో నిండిపోయింది. ఏమీ ఫర్వాలేదు. అల్లాహ్‌యే మాకు సరిపోతాడు. ఇక మీరు నిశ్చింతగా బయలు దేరండి' అని ఆ సాధ్వీమణి పలికారు. బరువైన హృదయంతో అల్లాహ్‌పై భారం వేసి ప్రయాణమయ్యారు ప్రవక్త ఇబ్రాహీమ్(అ). కొన్ని రోజులకే తీసుకువెళ్ళిన నీళ్ళు, ఖర్జూరాలు అయిపోయాయి. నాలుక తడుపుకోవటానికి సైతం చుక్క మంచినీళ్ళు కరువైన ఆ ఎడారి ప్రదేశంలో చిన్నారి పసికందు దాహంతో అలమటించ సాగాడు. అన్నపానీయాలు లేని కారణంగా తల్లి పాలు కూడా ఇంకిపోయాయి. పసివాడు నాలుక తడపటానికి సఫా, మర్వా కొండల మధ్య నీటికోసం పరుగులు తీశారు హజ్రత్ హాజిరా(అ). ఇప్పుడు హజ్ యాత్ర సందర్భంగా భక్తులు ఈ రెండు కొండల మధ్య అలాగే తిరిగి ఆనాటి సంఘటనను స్మరించుకుంటారు. ఈ విధానాన్నే 'సయీ' అంటారు. చిన్నారి ఇస్మాయిల్ దాహంతో ఏడుస్తూ కాలి మడమలతో నేలను తాకినచోట దైవాజ్ఞతో అద్భుత మైన నీటి ఊట వెలిసింది. అదే పవిత్ర జలం జమ్‌జమ్. ఆ నీటితో తల్లీ బిడ్డ దాహం తీర్చుకున్నారు. ఆనాడు వెలిసిన జమ్‌జమ్ ఊట నేటికీ కోట్లాది ప్రజల అవసరాలు తీరుస్తుంది. ఈ నీరు నిల్వ ఉంచినా చెడిపోదు, సుదూర ప్రాంతాలకు ముస్లిములు మక్కా నుంచి ఈ జమ్‌జమ్ నీరు తీసుకు వెళు తుంటారు. ఆనాటి ఆ నిర్జన ఎడారి ప్రాంతమే ఈనాటి సుందర మక్కా నగరం. ఆ తర్వాత కొంత కాలానికి దైవాదేశం మేరకు మక్కాలోని భార్యాబిడ్డలను కలుసుకున్నారు ఇబ్రాహీమ్(అ). ఆయన చేసిన త్యాగానికి ఫలితమే మనకు లభించిన దైవ ప్రసాదమే జమ్‌జమ్ జలం. ఆధునిక వైజ్ఞానికులు ఈ అద్భుతమైన జలంపై పరీక్షలు నిర్వహించారు. ఇది అత్యంత స్వచ్ఛమైన జలం. మానవ కణజాలాలకు శక్తిని పెంపొందిస్తుంది. ఈ విషయాన్ని జర్మన్ శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు. బ్యాక్టీరియా, వ్యాధి క్రిముల బారి నుండి ఈ జలం కాపాడుతుంది. రక్తంలో ఉన్న ప్లేట్‌లెట్స్‌ని అభివృద్ధి చేసి రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది. ఈ జలం ఆకలి ప్రభావాన్ని తగ్గిస్తుంది. తద్వారా స్థూలకాయాన్ని నివారి స్తుంది. కాల్షియం, మెగ్నీషియం ఈ నీటిలో సమృద్ధిగా ఉన్నాయి. వీటిలో వ్యాధిని నయం చేసే గుణగణాలు ఉన్నాయని శాస్త్రీయంగా నిరూపించబడింది. నాటి నుండి నేటివరకు రోజూ కొన్ని మిలియన్ గాలన్ల నీటిని సౌదీ ప్రభుత్వం యాత్రికులకు స్వచ్ఛందంగా అందిస్తుంది. ఎప్పుడూ నీటి కొరత రాలేదు. ప్రపంచ ప్రజలు ఇప్పటికీ దీనిని ఒక అద్భుతంగా భావిస్తారు. ఆ తర్వాత ఇస్మాయిల్(అ)తో కలిసి కాబా గృహాన్ని నిర్మించారు ఇబ్రాహీం(అ).

ఆయనకు మరో పరీక్ష ఎదురైంది. ఇది మామూలు పరీక్ష కాదు. మానవ చరిత్రలోనే కనీవినీ ఎరుగని పరీక్ష. దైవం ఈసారి ఏకంగా కన్న కొడుకునే త్యాగం చెయ్యమని కలలో ఆదేశించాడు. దివ్య ఖుర్‌ఆన్ సాఫ్ఫాత్ సూరాలో ఇబ్రాహీమ్(అ) త్యాగనిరతిని గురించి ఇలా ప్రస్తావించాడు: "మేము అతనికి ఒక సహనశీలుడైన కుమారుడు కలుగుతాడనే శుభవార్తను అందజేశాము. ఆ బాలుడు అతనికి తోడుగా పనిచేసే వయస్సుకు చేరుకున్నప్పుడు (ఒకనాడు) ఇబ్రాహీం అతనితో ఇలా అన్నాడు: "కుమారా! నేను నిన్ను జిబాహ్ (బలి) చేస్తున్నట్లుగా కలలో చూశాను. ఇక నీ అభిప్రాయమేమిటో చెప్పు. అతను ఇలా అన్నాడు : 'నాన్న గారూ!

మీకు ఆజ్ఞాపించబడిన దానిని నెరవేర్చండి. అల్లాహ్ సంకల్పిస్తే మీరు నన్ను సహనశీలునిగా చూస్తారు'' చివరకు వారు ఉభయులూ (దైవాజ్ఞ)ను శిరసావహించారు. ఆనాడు ఆ తండ్రీకొడుకులు చేసిన త్యాగాన్ని స్మరిస్తూ నేడు ముస్లిములు ఖుర్బానీ ఇస్తుంటారు. ఇబ్రాహీమ్(అ) తన కుమారుణ్ణి బోర్లా పరుండబెట్టారు. అప్పుడు మేము అతనిని పిలిచి ఇలా అన్నాము : ఇబ్రాహీం నీవు కలను నిజం చేసి చూపించావు. సత్కార్యం చేసేవారికి మేము ఇలాంటి ప్రతిఫలాన్నే ఇస్తాము. నిశ్చయంగా ఇది ఒక స్పష్టమైన పరీక్ష. మేము ఒక పెద్ద ఖుర్బానీని పరిహారంగా ఇచ్చి ఆ బాలుణ్ణి విడిపించుకున్నాము. అతని కీర్తి ప్రతిష్టలు తరువాతి తరాల వారిలో శాశ్వతంగా నిలిచిపోయేలా చేశాము. (సాఫ్ఫాత్: 99-110) పెద్ద ఖుర్బానీ అనే పదానికి ఒక అర్థం ప్రళయం వచ్చేవరకు. విశ్వాసులం దరూ ఒకేరోజున ఈ జంతు ఖుర్బానీ పాటించాలని, భక్తి విశ్వాసాలకు ప్రతీక అయిన ఈ మహత్తర సంఘటన జ్ఞప్తిలో ఉండాలని దివ్యఖుర్ఆన్ ఇలా ప్రకటించింది: 'వాటి (ఖుర్బానీ పశువుల) మాంసం గాని, రక్తంగానీ అల్లాహ్‌కు చేరవు. మీ భక్తి పరాయణత మాత్రమే ఆయనకు చేరుతుంది (అల్ హజ్జ్ : 37) ఈ దైవ వాక్యాల ద్వారా ఖుర్బానీ అంటే పశు బలి మాత్రం కాదు' అని స్పష్టంగా తెలుస్తుంది. ఖుర్బానీ అంటే సామీప్యం, సమర్పణ, త్యాగం అనే అర్థాలున్నాయి. అంటే మనలోని పశు ప్రవృత్తిని వధించినట్లుగా భావించ వచ్చు. ఖుర్బానీకి మరో ప్రత్యామ్నాయం లేదు. ఖుర్బానీ దేవునికి అత్యంత ఇష్టమైన ఆచరణ. ఇది కూడా ఒక ఆరాధనే. ఈ ఆరాధనలో పశువును ఖుర్బానీ చెయ్యటం ఒక చిహ్నం. నా నమాజ్ నా సకల ఉపాసనా రీతులు, నా జీవనం, నా మరణం. సమస్తమూ సకల లోకాలకూ ప్రభువైన అల్లాహ్ కొరకే. ఆయనకు ఏ భాగస్వామీ లేడు. ఈ ఆజ్ఞయే నాకు ఇవ్వబడినది. అందరికంటే ముందు విధేయతతో తల వంచేవాణ్ణి నేనే. (అన్అమ్ : 16) అని ప్రార్థిస్తూ పశువును ఖుర్బానీ చేస్తాము.

దేవుడు మనిషిలో వుంచిన మహాశక్తివంతమైన సుగుణం త్యాగం. త్యాగమయ జీవులను ప్రపంచం చిరకాలం గుర్తుంచుకుంటుంది. త్యాగం మానవులను ఏకతాటిపై నడిపించగలదు. ఇస్లామీయ క్యాలెండర్ ప్రకారం జిల్‌హజ్ మాసం పదవ తేదీన ఈ పండుగ జరుగుతుంది. ఈ రోజే పవిత్ర మక్కా నగరంలో హజ్ ఆరాధన కూడా జరుగుతుంది. కనుక ఈ పండుగలో ఆచరించే ప్రతి ఆచరణలో ఇబ్రాహీమ్ (అ), ఇస్మాయీల్(అ) గార్ల స్ఫూర్తి తొణికిసలాడాలి. త్యాగం, సహనం, దైవం పట్ల వినయ విధేయతలను పెంపొందించుకోవటమే 'ఖుర్బానీ పండుగ' అసలు ఉద్దేశం. ధన, మాన, ప్రాణాలన్నీ అల్లాహ్ మార్గంలో సమర్పించటమే ఈ పండుగ లక్ష్యం. భయభక్తులు, వినయ విధేయతలు ఖుర్బానీకి ఆత్మ లాంటివి. దైవారాధనలో ఎలాంటి త్యాగానికైనా సిద్ధమన్న సంకల్పాన్ని ప్రకటించే చిహ్నంగా ఖుర్బానీ ఇచ్చినప్పుడే ఇబ్రాహీం(అ)లాగే నిజమైన దైవ సామీప్యాన్ని పొందగలం. అలా దైవప్రీతిని పొందే భాగ్యాన్ని అల్లాహ్ ప్రసాదించాలని వేడుకుందాం.

(ఆమీన్)


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.


GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com




- దియా, విజయవాడ

**సృష్టికర్త** అల్లాహ్ కొన్ని ప్రత్యేక సమయాలను ఇతర సమయాలపై, కొన్ని నెలలను ఇతర నెలలపై, కొన్ని దినాలను, రాత్రులను ఇతర రోజులు, రాత్రులపై ప్రాముఖ్యతను ఇవ్వటం జరిగింది. 'ఉషోదయం సాక్షిగా! పదిరాత్రుల సాక్షిగా! (అల్‌ఫజ్ర్: 1,2) అల్లాహ్ పది దినాలపై ప్రమాణం చేయటం జరిగింది. ప్రవక్త(స) వారి కాలం నుండి సజ్జనులయిన మన పూర్వీకులు మూడు పదులను గొప్పవిగా భావించేవారు. 1) జిల్‌హిజ్జా మొదటి పదిరోజులు 2) రమజాన్ మాసపు చివరి పదిరోజులు 3) ముహర్రమ్ మాసపు తొలి పది రోజులు. దివ్య ఖుర్‌ఆన్‌లో పది రాత్రులు అంటే జుల్‌హిజ్జా నెలలోని మొదటి పది రాత్రులని చాలామంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు అభిప్రాయ పడ్డారు. జుల్‌హిజ్జా నెలలోని ప్రథమ దశకంలో చేసిన పుణ్యకార్యాలు అల్లాహ్‌కు అన్నిటికన్నా ఎక్కువ ప్రియమైనవి. రమజాన్ మాసం ఇస్లామీయ జగత్తులో దైవభీతిని సృష్టించే కాలమైతే హజ్‌కాలం ప్రపంచమంతటా ఇస్లామ్‌ను పునరుజ్జీవింపజేసే కాలం. జుల్‌హిజ్జా మాసం తొలి పది దినాలలోనే అరఫా రోజు కూడా ఉంది. పాపాల క్షమాపణ, నరకం నుండి విముక్తి పొందే అరఫా రోజే హజ్‌కి అసలైన రోజు. హజ్ దినాలు స్వతహాగా ఎంతో మహత్తు గలవి. అందులో అరఫా దినం అత్యంత మహత్తరమైనది. అరఫా దినం గొప్పతనం గురించి అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) ఏమన్నారంటే 'శాపగ్రస్తుడైన షైతాన్ అరఫా దినాన కుమిలి పోయినంతగా మరెన్నడూ కుమిలిపోడు. ఆ రోజు ఎంతో అవమానితుడై, తీవ్రంగా మనస్తాపం చెందుతాడు. ఎందుకో తెలుసా? ఆ రోజున దైవకారుణ్యం అదే పనిగా వర్షిస్తూ దైవభక్తుల పెద్ద పెద్ద పాపాలను ప్రక్షాళనం చేస్తూ ఉంటుంది. అరఫా దినం కాకుండా దైవధూత్కారి చాలా ఎక్కువగా పరాభవం పాలైన దినం మరేదైనా ఉందా అంటే అది బద్ర్ దినం అని చెప్పాల్సి ఉంటుంది. ఎందుచేత? అని దైవప్రవక్తను ప్రశ్నించగా, 'ఎందుకంటే, ఆ దినాన దైవదూత జిబ్రయీల్(అ) సయితం తన సేనల సమేతంగా దివి నుంచి భువికి దిగి వచ్చి యుద్ధం చేయటాన్ని షైతాన్ చూశాడు. దైవ తిరస్కారులకు వ్యతిరేకంగా విజృంభించమని సేనలను పురికొల్పటం చూసి అవమానంతో కృంగిపోయాడు అని ఆయన సమాధానమిచ్చారు (బైహకీ). దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు: పుణ్యకార్యాలు అమితంగా ఇష్టపడే దినాలలో జుల్‌హిజ్జా మాసపు పది దినాలు కాకుండా అల్లాహ్ దృష్టిలో వేరే దినాలేమీ లేవు. కాబట్టి ఈ సమయంలో లాయిలాహ ఇల్లల్లాహ్; అల్లాహు అక్బర్. అల్‌హమ్దులిల్లాహ్.. ఎక్కువగా పఠించండి. జిక్ర్ చేయటం (దైవనామ స్మరణ) ఉత్తమం అని తెలుస్తుంది. విశ్వాసుల ఈ విశ్వజనీన సమావేశానికి (హజ్) ప్రేరణ ఏది? అంటే 'లాయిలాహ ఇల్లల్లాహ్' ఇదే స్థిరమైన వచనం. ఇదే నిత్యం ఫలాన్నందించే పరిశుద్ధ వృక్షం.

జిల్‌హజ్జా మాసపు తొలి పది రోజులలోని ప్రార్థనల గురించి ఇబ్నె హజర్(ర) ఇలా అన్నారు : "ముఖ్యమైన ప్రార్థనలన్నీ ఉదా।। నమాజ్, ఉపవాసం, సదఖా, హజ్ మొదలగు ప్రార్థనలన్నీ ఈ పది రోజులలో జమ అవుతాయి. మిగతా రోజుల్లో అలా జరగదు. (ఫత్‌హుల్‌బారీ) దైవప్రవక్త ముహమ్మద్(స) అరఫా రోజు ప్రాముఖ్యత చెబుతూ ఇలా ప్రవచించారు: 'అరఫా రోజు ఉండే ఉపవాసం రెండు సంవత్సరాల పాపాలను ప్రక్షాళనం చేస్తుంది. (ముస్లిం) దైవప్రవక్త(స) ప్రతి సంవత్సరం ఖుర్బానీ ఇచ్చేవారు. ఆయన(స) ఇలా సెలవిచ్చారు : "ఖుర్బానీ ఇచ్చే స్థోమత ఉండి కూడా ఖుర్బానీ ఇవ్వనివాడు మా ఈద్గాహ్‌కు రాకూడదు". దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు : "రోజులలో అన్నిటికంటే ఉత్తమమైన రోజు యౌమున్నహర్". ఈ హదీసు ఆధారంగా కొంతమంది పండితులు అన్ని రోజుల కంటే ఉత్తమమైన రోజు యౌమున్నహర్ అనగా జుల్‌హజ్జా మాసపు పదవ రోజు (పండుగ రోజు) అనంటారు. హజ్రత్ ఇబ్రాహీం (అ) చూపిన అనన్యమైన త్యాగానికి గుర్తుగా జరుపుకునే పండుగే బక్రీద్. నిజ దైవాన్ని గుర్తించి తార్కిక జ్ఞానాన్ని, ప్రతి విషయాన్ని గుడ్డిగా విశ్వసించక, తాత ముత్తాతల నాటి అర్థం లేని ఆచారాలను పాటించక పరిశీలనాత్మకంగా, ఆలోచించాలనే బోధన ఇబ్రాహీమ్(అ) జీవిత గాథ వివరిస్తుంది. ఖుర్బానీని ఆరాధనా భావంతో ఇవ్వాలే కాని ఆచారంగా కాదు. దైవారాధనలో ఎలాంటి త్యాగానికైనా సిద్ధమన్న సంకల్పాన్ని ప్రకటించే చిహ్నంగా ఖుర్బానీ ఇచ్చినప్పుడే ఇబ్రాహీమ్(అ)లాగే నిజమైన దైవ సామీప్యాన్ని పొందగలం. (ఆమీన్)



# అల్లాహ్ అస్తిత్వాన్ని నిరూపించే ఖుర్ఆన్ బోధనలు

డా. సాజిద్ అబ్బాసీ

**అల్లాహ్** అస్తిత్వాన్ని, దేవుని ఏకత్వాన్ని నిరూపించే ఉపమానాలు, ఆధారాలు ఖుర్ఆన్ గ్రంథంలో ఎన్నో ఉన్నాయి. ఈ ఆధారాలు సుస్పష్టంగా వివరించబడ్డాయి. వాటిని చదివాక ఈ విశ్వానికి ఒక సృష్టికర్త ఉన్నాడని, ఆయన పరిపాలకుడు, పోషకుడు, సృష్టి నిర్వాహకుడు అని మనసు అప్రయత్నంగానే సాక్ష్యమిస్తుంది.

అల్లాహ్ మనిషికి బుద్ధీ జ్ఞానాలను, మంచీ చెడుల విచక్షణా జ్ఞానాన్నిచ్చాడు. మనిషి తన బుద్ధీ జ్ఞానాలను ఉపయోగించి సృష్టికర్తను గుర్తిస్తాడా? సృష్టికర్తను గుర్తించిన తరువాత ఆయనకు దాస్యం చేస్తాడా అన్నది దేవుడు పెట్టే పరీక్ష. మనిషికి రెండు ప్రధాన అనుగ్రహాలు దేవుడు ప్రసాదించాడు. 1. ఇంద్రియాలు 2. బుద్ధీ వివేకాలు. మనిషికి రెండు రకాలుగా జ్ఞానం లభిస్తుంది. ఒకటి అనుభవాల ద్వారా, ఇందులో ఇంద్రియాలు, బుద్ధీ వివేకాలు ఉపయోగపడతాయి. ఇక రెండో రకమైనది అగోచర జ్ఞానం. మన బుద్ధీ జ్ఞానాలకు అందని మరో వాస్తవ ప్రపంచమూ ఉంది. సృష్టికర్త, మరణానంతర జీవితం ఈ సత్యాలను సైన్స్ అండ్ టెక్నాలజీల ద్వారా కనుగొనలేము. ఈ వాస్తవాలను కేవలం దైవ వాణి ద్వారానే తెలుసుకోగలము. అగోచర విషయాల జ్ఞానాన్ని తెలుసుకోవాలంటే కేవలం వహీ ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. ఆ జ్ఞానాన్ని ఖుర్ఆన్, ముహమ్మద్ ప్రవక్త (స) ప్రబోధనల ద్వారా మాత్రమే తెలుసుకునే వీలుంటుంది. కేవలం ఊహల ద్వారా అగోచర జ్ఞానాన్ని పొందలేము. వాస్తవాలు కళ్ళముందుకు వచ్చినప్పుడు మన విచక్షణతో మాత్రం పసిగట్టవచ్చు. సత్యాసత్యాలను తెలుసుకోగలము. ఏది దైవగ్రంథమో, మరేది మానవ రచనో మన బుద్ధి అంచనా వేయగలదు. అల్లాహ్ చివరి సందేశం ఖుర్ఆన్ రూపంలో మన వద్ద నిక్షిప్తంగా ఉంది. దీని సంరక్షణ బాధ్యత స్వయంగా అల్లాహ్ యే తీసుకున్నాడు.

నేడు ప్రపంచంలో దైవాన్ని తిరస్కరించే సంస్కృతి వేగంగా పెరుగుతోంది. ముస్లిముల్లోనూ పెరుగుతూ పోతోంది. ఖుర్ఆన్‌లో దేవుని ఏకత్వాన్ని నిరూపించే స్పష్టమైన ఆధారాలు ఎన్నో ఉన్నాయి. వాటిని చదివాక ఈ విశ్వానికి ఒక సృష్టికర్త ఉన్నాడని మన అంతరాత్మ సాక్ష్యం పలుకుతుంది. దైవ తిరస్కారులనుద్దేశించి ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఏమని ప్రశ్నిస్తున్నాడంటే..

"వారు సృష్టికర్త లేకుండా తమంతట తామే పుట్టారా? లేక వారు తమకు తామే సృష్టికర్తలా? లేక వారు భూమినీ, ఆకాశాలనూ సృష్టించారా? అసలు విషయం ఏమిటంటే, వారికి నమ్మకం లేదు." (దివ్య ఖుర్ఆన్ 52:35-36)

ఏ వస్తువు తనకు తానుగా ఉనికిలోకి రాదనే విషయం పై ఖుర్ఆన్ వాక్యాలు స్పష్టం చేస్తున్నాయి. ఏదీ స్వయంగా ఉనికిలోకి రావడం ఇప్పటివరకూ జరగలేదు. ఈ అద్భుతమైన విశ్వాన్ని సృష్టించినవాడు ఒకడు ఉండి తీరాల్సిందేనన్న విషయం విశదపరుస్తుంది ఖుర్ఆన్ వాక్యం.

ఆయనే సృష్టిని ప్రారంభిస్తాడు. ఆయనే దానిని మళ్లీ సృష్టిస్తాడు. ఇది ఆయనకు సులభతరం. ఆకాశాలలోనూ, భూమిపైనా ఆయన గుణగణాలు సర్వోన్నతమైనవి, ఆయన శక్తిమంతుడు, వివేకవంతుడూను. (దివ్య ఖుర్ఆన్ 30:27)

సృష్టికర్త లేకుండానే మానవజాతి ఉనికిలోకి వచ్చిందా? అని అల్లాహ్ ప్రశ్నిస్తున్నాడు. ప్రపంచంలో ఏ చిన్న యంత్రం కూడా దానంతట అది ఉనికిలోనికి రాలేనప్పుడు అద్భుతమైన మానవ సృష్టి ఎలా దానంతట అదే ఉనికిలోకి రాగలుగుతుంది? మనిషి మిలియన్ల కణజాలాలతో కూడిన సృష్టి, అద్భుతమైన మేథోసృష్టి. అల్లాహ్ అడిగే మరో ప్రశ్న ఏమంటే మనిషిని మనిషే సృష్టించాడా? మనిషిని మనిషే సృష్టించాడని ఇప్పటివరకు ఎవరైనా చెప్పారా? లేదు. మనిషి తనకు తానుగా స్వయంగా ఉనికిలోకి రాలేదు, మనిషిని మరో మనిషీ సృష్టించలేదు.

## అల్లాహ్ ప్రశ్నలు..

మేము మిమ్మల్ని సృష్టించాము, మరెందుకు మీరు ఈ విషయాన్ని ధృవీకరించరు? ఎప్పుడైనా మీరు ఇలా ఆలోచించారా: మీరు విడిచే ఈ రేతస్సుతో బిడ్డను మీరు తయారు చేస్తారా లేక దానిని సృష్టించేవారము మేమా? (దివ్య ఖుర్ఆన్ 56:57-59)

ఎప్పుడైనా మీరు ఇలా ఆలోచించారా మీరు నాటే ఈ విత్తనాలతో పొలాలను మీరు పండిస్తారా లేక వాటిని పండించేవారము మేమా? (దివ్య ఖుర్ఆన్ 56:63-64)

మీరు రాజేసే అగ్నిని గురించి ఎప్పుడైనా ఆలోచించారా? దానికి సంబంధించిన వృక్షాన్ని మీరు సృష్టించారా లేక దానిని సృష్టించిన వారము మేమా? (దివ్య ఖుర్ఆన్ 56:71-72)

పై ఖుర్ఆన్ వాక్యాలలో అల్లాహ్ వేసిన ప్రశ్నలకు మనిషి దగ్గర సమాధానం లేదు. ఈ లోకంలో మనిషిని సృష్టించి, మానవుల అవసరాలు తీర్చేందుకు ప్రకృతిని సృష్టించిన ఆ గొప్ప శక్తి పేరే అల్లాహ్. ఆయన వర్షాన్ని కురిపించి, అగ్నిని సృష్టించాడు. ఇవి రెండూ లేకుండా మనిషి బ్రతకిబట్టకట్టలేడు.

## ఇనుము.. మనము..

ఇనుమునూ దింపాము. అందులో మహత్తరమైన శక్తి ఉన్నది, ప్రజలకు ప్రయోజనాలూ ఉన్నాయి. (దివ్య ఖుర్ఆన్ 57:25)

పారిశ్రామికంగా మనిషి ఇంతగా పురోగతి సాధించాడంటే అందులో ఇనుము పాత్ర ఎంతో ఉన్నది. ఇనుము లేకుండా ఏ యంత్రమూ తయారు కాదు. మరీ ముఖ్యంగా పెద్ద భవంతుల నిర్మాణాలలో ఇనుము ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఎన్ని గాలులు, స్వల్ప భూకంపాలకు తట్టుకుని ఈ భవనాలన్నీ దశాబ్దాల కాలంపాటు నిలబడగలుగుతున్నాయి. ప్రళయ కాలం వరకూ సరిపడా ఇనుమును అవతరింపజేశాడు అల్లాహ్. నేడు, మానవ పురోగతితో, నాగరికత అత్యున్నత అవసరాలు నెరవేరుతున్నాయి. అత్యంత శక్తివంతుడైన సృష్టికర్త మానవజాతి అవసరాలు తీర్చేందుకు అన్ని ఏర్పాట్లూ, వనరులూ సమకూర్చాడు. భూగర్భంలో ఉన్న అన్ని లోహాలు ఒక నిర్దిష్ట పరిమాణంలో ఉంచబడ్డాయి, ఇవి ప్రతి యుగంలో మనిషి అవసరాలను తీరుస్తున్నాయి.

## నీరు..మీరు..

"ఒకవేళ మీ బావులలోని నీరు భూమి లోపలకు ఇంకిపోతే, ప్రవహించే ఈ నీటి ఊటలను మళ్లీ మీ కోసం బయటకు తెచ్చేదెవరు?'' (దివ్య ఖుర్ఆన్ 57: 30)

నీరు మనిషి జీవనాధారం. వర్షాలు కురవకపోతే కరువుకాటకాలు ఏర్పడి మనుషులు, జంతుజాలాలన్నీ చనిపోతాయి.

ఆకాశం నుండి మేము సరిగ్గా లెక్క ప్రకారం ఒక ప్రత్యేక పరిమాణంలో నీటిని దింపాము, దానిని భూమిలోపల నిలువ చేశాము. మేము దానిని ఎలా కోరితే అలా మాయం చేయగలం. (దివ్య ఖుర్ఆన్ 23:18)

సముద్ర ఉపరితలం నుండి టన్నుల కొద్దీ నీరు ఆవిరైపోతుంది. మేఘాల రూపంలో సుదూర ప్రాంతాలకు చేరి వర్షిస్తుంది. ఒక్కోసారి ఈ వర్షం పంటలు పండిస్తే, మరోసారి బీభత్సం సృష్టిస్తోంది. భూమిలోకి ఇంకిన వర్షపు నీటితో మనుషజాతికీ, జీవకోటికి ఉపయోగపడుతోంది. ఇంతటి మేలు చేస్తున్న సృష్టికర్తను వదిలిపెట్టి మనిషి మూర్ఖంగా వ్యవహరిస్తున్నాడు. అల్లాహ్ తలచుకుంటే భూమిలో నీటి వనరులను మాయం చేయగలడు.

భూమిని మీ అధీనంలో ఉంచినవాడు ఆయనే, కనుక దానిమీద తిరగండి, దేవుడు ప్రసాదించిన ఆహారాన్ని తినండి. ఆయన సాన్నిధ్యానికే మీరు మళ్లీ సజీవులై పోవలసి ఉంది. ఆకాశంలో ఉన్న వాడు మిమ్మల్ని భూమిలోకి దిగద్రొక్కడని, భూమి హఠాత్తుగా తీవ్ర కంపనాలకు గురికాదని మీరు నిర్భయంగా ఉన్నారా? ఆకాశంలో ఉన్నవాడు మీపైకి రాళ్లను విసిరే పెనుగాలిని పంపడని మీరు నిర్భయంగా ఉన్నారా? అప్పుడు నా హెచ్చరిక ఎలా ఉంటుందో మీకు తెలిసిపోతుంది. (దివ్యఖుర్ఆన్ 67:15-17)

ఈ ప్రపంచాన్ని సకల జీవరాశుల జీవనానికి అనువైనదిగా ఎలా సృష్టించాడో పై ఖుర్ఆన్ ద్వారా అల్లాహ్ వివరించాడు. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ తిరుగుతోంది. ఎలాంటి కుదుపులు లేకుండా తిరుగుతోంది. పర్వతాలను మేకుల్లాగా పాతిపెట్టడం వల్ల భూమి కుదుపులను నియంత్రించాడు. పైన గాలి పీడనం, కింద భూమి గురుత్వాకర్షణ శక్తి, మేకుల్లా పాతబడిన పర్వతాలు ఇవన్నీ కలిసి మనకు భూమి తిరుగుతున్నా కుదుపులకు గురవడం లేదు. పర్వతాల ప్రయోజనాల గురించి ఖుర్ఆన్ ఇలా పేర్కొంటోంది:

మేము భూమిపై పర్వతాలను పటిష్ఠంగా నిలబెట్టాము, అది వాటితో దొర్లిపోకుండా ఉండాలని. (దివ్య ఖుర్ఆన్ 21:30)

అల్లాహ్ ఈ భూమిని మనిషికి నివాసయోగ్యంగా తీర్చిదిద్దాడు. సూర్యుని నుండి వచ్చే ప్రమాదకరమైన కిరణాలనుంచి కాపాడేందుకు ఆకాశంలో ఓజోన్ పొరను ఏర్పాటు చేశాడు. Ultraviolet rays, Radiation, Global warming ల నుంచి ఓజోన్ పొర రక్షణగా నిలుస్తుంది. ఇది అల్లాహ్ శక్తియుక్తులకు, దయా గుణానికి నిదర్శనం. ఈ విషయాన్ని ఖుర్ఆన్ ఈ విధంగా పేర్కొంటోంది : "మేము ఆకాశాన్ని ఒక సురక్షితమైన కప్పుగా చేశాము. కాని వారేమో సృష్టి యొక్క ఈ సూచనల వైపునకు తమ దృష్టినే మళ్లించరు." (దివ్య ఖుర్ఆన్ 21: 32)

మనిషి అల్లాహ్‌ను గుర్తించడానికి ఈ నిదర్శనాలు సరిపోవా? భూమిపై సూర్యరశ్మి, వేడిమి, కాంతి నిర్వహణ వ్యవస్థ కోసం సౌర వ్యవస్థను ఏర్పాటు చేశాడు. భూభ్రమణం ద్వారా రాత్రింబవళ్లు ఏర్పాటు చేశాడు. పగలు జీవనోపాధికోసం, రాత్రిని విశ్రాంతి కోసం నిర్ణయించాడు. "రాత్రినీ, పగలునూ సృష్టించినవాడూ, సూర్యచంద్రులను పుట్టించిన వాడూ అల్లాహ్ యే. అవన్నీ తమ తమ కక్ష్యలలో తేలియాడుతూ ఉన్నాయి." (దివ్య ఖుర్ఆన్ 21:33)

ఈ నేల నుండి బిలియన్ల జనాభాకు, ఇతర జీవరాశులకు ఉపాధి ఏర్పాట్లు చేశాడు. ఈ నేలలో ఆహార గింజలు, పండ్లు, కూరగాయలు, పశుగ్రాసం పెరుగుతాయి. పశువుల ద్వారా మాంసం, పాలు లభిస్తాయి.

## పశువుల నుంచి గుణపాఠం..

"నిజంగానే పశువులలో కూడ మీకు ఒక గుణపాఠం ఉంది. వాటి గర్భాలలో ఉన్న దానినుంచే మేము ఒక వస్తువును (అంటే పాలు) మీకు త్రాపుతున్నాము. మీకు వాటిలో ఇంకా ఎన్నో ఇతర లాభాలు కూడ ఉన్నాయి. వాటిని మీరు తింటారు, వాటిపైనా, పడవలలోనూ ఎక్కుతారు కూడ." (దివ్య ఖుర్ఆన్ 23:21-22)

ఈ విశ్వంలో మరీ ముఖ్యంగా ఈ భూమిపై అసంఖ్యాకమైన జీవుల పుట్టుక, సంతానోత్పత్తి, వాటి జీవనోపాధి కల్పించడం లాంటివన్నీ దైవశక్తి నిదర్శనాలని పై ఖుర్ఆన్ వాక్యం పేర్కొంటోంది. అంతరిక్షంలో గ్రహాలు తమ తమ కక్షలలో తిరగడం ఈ సృష్టి క్రమశిక్షణకు నిదర్శనం. ఈ విశ్వవ్యవస్థ నిర్వహణ చూసే కర్త ఒక్క సెకను కాలమైనా తన దృష్టిని విస్మరించినట్లయితే సృష్టిమొత్తం అస్తవ్యస్తమవుతోంది. ఇదే విషయాన్ని ఖుర్ఆన్ ఇలా ధృవీకరిస్తోంది : "ఆయన నిదురపోడు, ఆయనకు కునుకూ రాదు." (దివ్యఖుర్ఆన్ 2: 255) బస్సు నడిపే డ్రైవర్ ఒక్క సెకను కోసమైనా కునుకు తీసాడంటే బస్సులో ప్రయాణించే వారి ప్రాణాలన్నీ గాలిలో కలిసిపోయినట్లే. అంతరిక్షంలో గ్రహాలు మిలియన్ల మైళ్ల వేగంతో ప్రయాణిస్తుంటాయి. ఖుర్ఆన్‌లో అల్లాహ్ అస్తిత్వాన్ని చాటిచెప్పే ఎన్నో ఆధారాలున్నాయి. వాటన్నింటినీ ఈ వ్యాసంలో పొందుపర్చడం సాధ్యంకాదు. ఈ ఆధారాలను ఉటంకిస్తూ ఖుర్ఆన్ ప్రశ్నిస్తోంది. "భూమినీ, ఆకాశాలనూ ఎవడు సృష్టించాడు, చంద్రుణ్ణీ, సూర్యుణ్ణీ ఎవడు అదుపులో ఉంచాడు, అని నీవు వారిని అడిగితే, అప్పుడు వారు "అల్లాహ్" అని అంటారు. అయితే వారు ఎలా మోసపోతున్నారు? " (దివ్య ఖుర్ఆన్ 29:61)

నీవు వారిని, "ఆకాశం నుండి ఎవడు వర్షాన్ని కురిపించాడు, దాని ద్వారా మృతభూమిని ఎవడు బ్రతికించాడు" అని అడిగితే అప్పుడు వారు, "అల్లాహ్" అని తప్పకుండా అంటారు. "అల్ హమ్‌దులిల్లాహ్" (అల్లాహ్‌యే స్తుతింపదగినవాడు) అని అను. కాని వారిలో చాలామంది అర్థం చేసుకోరు. (దివ్య ఖుర్ఆన్ 29:63)

భూమ్యాకాశాలను అల్లాహ్ యే సృష్టించాడన్నది బుద్ధిజ్ఞానాలున్న వారెవరైనా ఇట్టే చెప్పేయగలరు. పై ప్రశ్నలకు ఇంతకు మించిన జవాబు మరొకటి లేదు. ఆయనే నింగి నుండి వాన కురిపిస్తున్నాడు. మృతభూమికి ప్రాణం పోస్తున్నాడు. అల్లాహ్ యొక్క అనంతమైన మేళ్లను కనీ, వినీ, అనుగ్రహించి కూడా అల్లాహ్‌ను గుర్తించడమనేది అతని తెలివితేటలకు పరీక్ష లాంటిదే. అల్లాహ్ ఒక్కడే అని విశ్వసించడం అనేది రెండో పరీక్ష.

**గత సంచిక తరువాయి...**

**చివరకు మేము అతన్నీ అతని గృహాన్నీ, భూమిలోనికి అణగ ద్రొక్కాము. తరువాత అల్లాహ్ కు వ్యతిరేకంగా, అతనికి సహాయం చేయటానికి ముందుకు వచ్చే అతని మద్దతు దారుల వర్గం ఏదీ లేదు. స్వయంగా అతను కూడా తనకు తాను సహాయం చేసుకో లేకపోయాడు.**

**(ఖసస్: 79-81)**

# మనోవాంఛల దాస్యం జీవితంపై వేసే దుష్ప్రభావం

**- ప్రొఫెసర్ సవూద్ ఆలమ్ ఖాస్మీ**

## పదార్థ పూజ : దాని ప్రభావాలు

మనిషి జీవితంపై ప్రపంచవ్యామోహం హానికారకమైన ప్రభావం వేస్తుంది. ప్రపంచ వ్యామోహం కలిగిన వ్యక్తి ప్రత్యక్షంగా ఎవరికీ ఎలాంటి హాని చేయకపోయినప్పటికీ, అలాంటి వైఖరి కలిగిన వ్యక్తి వల్ల సమాజానికి హాని తప్పదు. ఉదాహరణకు –

(1) ప్రాపంచిక వ్యామోహం కలిగిన వ్యక్తి తన వద్ద ఉన్న ధనసంపదలతో ఎన్నటికీ సంతృప్తి చెందడు. అతడికి తృప్తి అనేది ఎన్నటికీ లభించదు. ఇంకా సంపాదించాలన్న ప్రయాసలోనే ఎప్పుడూ ఉంటాడు. అతడి కోరికలకు అంతు ఉండదు. ప్రపంచ వ్యామోహాన్ని విశ్లేషిస్తు దివ్యఖుర్ఆన్ ఇలా చెప్పింది:

**వీలైనంత ఎక్కువగా ఒకరిని మించి ఒకరు ప్రపంచాన్ని పొందాలనే ధ్యాస మిమ్మల్ని ఏమరుపాటులో పడవేసింది. చివరకు మీరు (ఈ వ్యామోహంలోనే) సమాధులకు చేరుకుంటారు. (మీరనుకునేది) ఎంతమాత్రం కాదు, త్వరలోనే మీకు తెలిసిపోతుంది. (అత్తకాసుర్: 1-3)**

మరో చోట దివ్యఖుర్ఆన్ ఇలా పేర్కొంది:

**"మీరు వారసత్వపు ఆస్తి మొత్తాన్ని పోగుచేసి తినేస్తారు, ధనవ్యామోహంలో దారుణంగా చిక్కుకుపోయారు"**

**(ఫజ్ర్ : 19,20)**

"ఆదం పుత్రుడు ధన సంపదలతో నిండిన రెండు లోయలను ఇచ్చినా మూడో లోయ కావాలనుకుంటాడు. మనిషి పొట్టను మట్టి తప్ప మరేదీ నింపలేదు" అన్నారు ప్రవక్త ముహమ్మద్ (స).

(సహీహ్ ముస్లిం)

(2) ప్రపంచ వ్యామోహంలో మునిగిన వ్యక్తి మనోవాంఛలకు దాసుడు. కోరికలేం చెబితే అదే చేస్తాడు. మనోకాంక్షలు చూపిన మార్గంలో నడుస్తాడు. ఎలాంటి ఆధ్యాత్మిక, దైవిక హితబోధలు వినడానికి సిద్ధపడడు. దివ్యఖుర్ఆన్ ఇలాంటి వారి గురించి ఏం చెప్పిందంటే –

**మేము గనక కోరివున్నట్లయితే అతనికి ఆ ఆయతుల ద్వారా ఔన్నత్యాన్ని ప్రసాదించి ఉండేవారము. కాని అతడు భూమి వైపునకే మ్రొగ్గాడు. తన మనోవాంఛలనే అనుసరించాడు.**

**(ఆరాఫ్ : 176)**

(3) ప్రపంచ వ్యామోహంలో చిక్కుకున్న వ్యక్తి ధనసంపదలు, ప్రాపంచిక సరంజామా, భౌతికవనరులనే నమ్ముకుంటాడు. ఆధ్యాత్మిక శక్తి, దైవిక సహాయంపై అతనికి నమ్మకం ఉండదు. భౌతిక వనరులు లభిస్తే తనకు విజయం సాధించే మార్గం దొరికిందనుకుంటాడు. ఈ వనరులు అంతరిస్తే నిరాశకు గురవుతాడు. దివ్యఖుర్ఆన్ ప్రకారం భౌతికవనరులను, సాధనా సంపత్తిని ఉపయోగించడం మాత్రమే సరిపోదు, విశ్వప్రభువుపై నమ్మకం పెట్టుకోవాలని అది ఉపదేశిస్తుంది. ఎందుకంటే ఆ దైవమే వనరులను సృష్టించాడు. ఆయనే పరిస్థితులను కూడా సానుకూలంగా మలచగలడు.

అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు:

**ఎవడు అల్లాహ్‌కు భయపడుతూ పనిచేస్తాడో, అతనికి అల్లాహ్ కష్టాల నుండి గట్టెక్కే మార్గం చూపుతాడు. ఇంకా అతని ఊహకు కూడ అందనటువంటి మార్గం ద్వారా, అతనికి ఉపాధి ప్రసాదిస్తాడు. అల్లాహ్‌ను నమ్ముకున్నవానికి అల్లాహ్‌యే చాలు. అల్లాహ్ తన పనిని పూర్తి చేసి తీరుతాడు. అల్లాహ్ ప్రతిదానికి ఒక విధి నిర్ణయించి ఉంచాడు. (తలాఖ్: 2, 3)**

# కాలాన్ని కొనలేం


**- ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్**

మానవ జీవితం చాలా అమూల్యమైనది. అది ఎప్పుడు అంతమవుతుందో ఎవరికీ తెలియదు. అల్లాహ్ దాన్ని రహస్యంగా ఉంచాడు. దాన్ని ఛేదించే శక్తిని ఎవ్వరికీ ప్రసాదించలేదు. కనుక జీవితకాలాన్ని సద్వినియోగం చేసుకోవడంపైన్నే సాఫల్య వైఫల్యాలు ఆధారపడి ఉన్నాయి. ఈ ప్రపంచంలో మనం ఏదైనా సాధించవచ్చు. డబ్బు, గౌరవం, ఉద్యోగం, అధికారం, హోదా ఏదైనా కావచ్చు, అది సాధ్యమే. కాని కాలాన్ని మాత్రం ఎంత ధనం ధార పోసినా, ఎంత పలుకుబడి ఉపయోగిం చినా సాధించలేము. గడిచిన కాలం - అది రెప్పపాటైనా సరే - కోట్లు కుమ్మరిం చినా మనకు లభించదు. ఇది కాలం చెప్పే సత్యం.

మనం దాని విలువను గుర్తించకపోతే అది మన కోసం ఆగదు. గోడకు అమర్చిన గడియారం ముల్లు 'టిక్ టిక్'మని శబ్దం చేస్తూ తన పని అది చేస్తూనే ఉంటుంది. సమయాన్ని సమర్థవంతంగా సద్విని యోగం చేసుకోగలిగినప్పుడే అది మనకు ఉపకరిస్తుంది. లేకపోతే అది మనల్ని నిర్దాక్షిణ్యంగా వదిలేసి ముందుకు సాగిపోతుంది. అందుకని మనం ఏ విషయంలో అయినా సకాలంలో స్పందించగలగాలి. సమయం మించి పోయిన తరువాత తీరిగ్గా విచారిస్తే ప్రయోజనం ఉండదు. అవకాశాలు ఎప్పుడూ మన కోసం నిరీక్షిస్తూ ఉండవు. అవకాశాలను మనమే సృష్టించుకోవాలి. మనమే వాటిని అందిపుచ్చుకోవాలి. అవి మన వద్దకు రావాలని ఆశించడం కరెక్ట్ కాదు. ఎప్పుడు ఏది అవసరమో దానిపై దృష్టి కేంద్రీకరించాలి. బాధ్యతల నిర్వహణలో అలసత్వాన్ని ఎంతమాత్రం దరి చేరనీయకూడదు.

ఎందుకంటే, ఈ రోజు చేయవలసిన కార్యాన్ని రేపటికి వాయిదా వేశామంటే కాలం విలువను మనం గుర్తించనట్లే లెక్క. ఈనాటి కొద్దిపాటి అలక్ష్యం రేపటి బాధ్యతను రెట్టింపు చేస్తుంది. ఒకటికి రెండు తోడై, బాధ్యతలు పేరుకు పోతాయి. ఇక ఆ తరువాత బాధ్యతల నిర్వహణ తలకుమించిన భారంగా పరిణమించి, పలాయన వాదాన్ని ఆశ్ర యించే దుస్థితికి తీసుకు వస్తుంది. అద్భుతమైన విజయాలను సాధించినవారి జీవితాలను పరిశీలిస్తే, వారు కాలాన్ని (సమయాన్ని) ఎలా తమకు అనుకూలంగా మలచుకొని, సద్వినియోగం చేసుకొని, కొత్త అవకాశాలను సృష్టించుకున్నారో, కొంగ్రొత్త ఆవిష్కరణలకు ఎలా నాంది పలికారో మనకు అర్థమవుతుంది.

ప్రఖ్యాత శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్ తన జీవితకాలంలో వెయ్యికంటే ఎక్కువ నూతన ఆవిష్కరణలకు నాంది పలికాడు. వాటిలో గ్రామ్‌ఫోన్ , విద్యుత్తు బల్బు అతని ఆవిష్కరణలే అని మనందరికీ తెలుసు. ఇది ఎలా సాధ్యమైంది? అతను కాలం నాడిని ఒడిసిపట్టి, దాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. కాలక్షేపం కోసం కాలాన్ని దుర్వినియోగం చేయలేదు. సరదాలు, సొల్లుకబుర్ల కోసం సమయాన్ని నిర్లక్ష్యం చేయలేదు. అతను, తన ప్రయోగశాలనే వినోదశాలగా మార్చుకున్నాడు. చేస్తున్న పనిలోనే ఆనందాన్ని, వినోదాన్ని అనుభవిం చాడు. కాలం విలువను గుర్తించబట్టే, విద్యుత్ బల్బును కనుగొనే సమయంలో ఏకధాటిగా పన్నెండు, పదమూడు రోజులు ప్రయోగశాలలోనే నిద్ర లేని రాత్రులు గడిపాడు.




అందుకని కాలం విలువను, ప్రాధాన్యతను గుర్తించాలి. పవిత్ర ఖురాన్ కూడా 'కాలం సాక్షిగా' మానవాళికి అనేక హిత బోధలు చేసింది. కాలగతిలో కలిసిపోయిన వారి గాథల్ని గుణపాఠాలుగా వివరించింది. బుద్ధి జీవి అయిన మానవుడు ఈ హితోప దేశాలకనుగుణంగా నడచుకొని ఇహ పర లోకాల్లో సాఫల్యం పొందాలని ఆశిద్దాం.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**